# సహజమార్గము దృష్టా రాజయోగ ప్రభావము


## (Efficacy of Rajayoga)

రచయిత :

శ్రీ రామచంద్రజీ

**శ్రీ రామచంద్ర మిషన్**

షాజహాన్‌పూర్.



**మహాత్మా శ్రీ రామచంద్రజీ**

శ్రీ రామచంద్ర మిషన్, షాజహాన్ పూర్. (యు.పి.)

# రాజయోగము

ఆత్మస్వరూపుడైన భగవంతుని తెలిసికొనుటకు సాధనముగ మహర్షులచే ననుసరింపబడిన రాజయోగము ఒక ప్రాచీన శాస్త్రమైయున్నది. రామాయణమునకు చాలకాలము పూర్వమే హిందూదేశములో నది వ్యాపించియున్నది. సూర్యవంశజుడైన దశరథునకు 72 తరములు ముందు జీవించిన ఒకానొక మహర్షిచే నది ప్రవేశపెట్టబడినది. అతడు జీవిత సమస్యలు సులభముగ పరిష్కరింపబడుటకై, స్వాతంత్ర్యము పొందగల సరియైన పద్ధతి నొకదానికి కనిపెట్టుటకై చాల కాలము తీవ్రముగ నాలోచించెను. అతడా సమయములో 'కేంద్ర ప్రాంతము' (Central Region)లో (ఈ పుస్తకములో వర్ణింపబడినది) ఈదులాడుచు ఎక్కువగా "కేంద్రము" (Centre)నకే సంబంధించి యుండెను. అతని స్థితి, ప్రకృతి ఆదేశానుసారము మార్పు కొరకై కృషిచేయుచున్న ప్రస్తుత వ్యక్తిని బోలియుండెను. ఈ విషయమై తీవ్రముగ చాల కాలమాలోచించి యొక పద్ధతిని కనిపెట్టెను. అది యభివృద్ధి పొంది తుదకు రాజయోగముగ పరిణతి నొందినది. కేంద్రముతో నతనికి సన్నిహిత సంబంధమేర్పడగనే ప్రపంచ నిజస్వరూపమును దానికి మూలమైన శక్తి ఉనికిని నతడు కన్గొనెను. కేంద్రాథః ప్రదేశమునుండి కల్గిన ఒకానొక శక్తి యొక్క కదలికయే ప్రస్తుత ప్రపంచావిర్భావమునకు కారణమని యతడు కన్గొనెను. ఆ చైతన్యవంతమైన ఆలోచనయే (సంకల్పమే) "ఉపాదాన కారణ"మనియు "క్షోభ" యనియు పిలువబడును. చిట్టచివరికి అదియొక్క శక్తి ఫలితమనియు, ఊహాశక్తికి తుల్యమై ఆ శక్తి మానవుని చిత్శక్తికి తుల్యమై, దానితో నేకీభవించుననియు నతడొక నిర్ణయమునకు వచ్చెను (*మానవుని మనస్సునకు మూలకారణమైన దానికి సంబంధించిన సిద్ధాంతమిచ్చుట సకారణముగ వివరింపబడినది. భగవదిచ్ఛతో కలిగిన ప్రప్రథమ సంచలనమే (క్షోభకు) యీ ప్రపంచ ఆవిర్భావమునకు దారితీసినది. ఆ చైతన్యము అంతర్గతమైన శక్తిని విజృంభింపజేసి సృష్టి కార్యక్రమమును ప్రారంభించినది. చైతన్యవంతమైన ఆ మూలశక్తియే ప్రతి మనుష్యునిలో ముఖ్య చైతన్యశక్తిగా మార్పు చెందినది. మనుష్యునిలో నది మనస్సని పిలువబడుచున్నది. దానికి మూలమై ఆ నిశ్చల శక్తియే యున్నది. ఈ విధముగ మానవుని మనస్సు అది చైతన్య శక్తిలో భాగమై దానితో తుల్య రూపము గలదియై యున్నది. అందుచే రెండింటి క్రియా స్వరూపములును చాల దగ్గర సంబంధ సామ్యములను గల్గియున్నవి.*). సహజముగ ఆలోచనయే అట్టి ఫలితముల నుత్పత్తి చేయుననియు, దాని శక్తి యనంతమనియు, అతడూహించెను. మనకు నియతమైన చిత్శక్తినుపయోగించి యతడు శిక్షణ ప్రారంభించెను. యోగములకు రాజైన రాజయోగమునకు ఆధారమదియే! మనలోగల రాజలక్షణము ఆలోచనయే!

అదియే అభివృద్ధిపొంది మన గమ్య స్థానమునకు నడపును. ఆయా కాలములందలి ఋషులు వారివారి స్వానుభవములు పెరిగిన కొలది దాని నభివృద్ధి పరచుచు వచ్చిరి. చెప్పవలెనన్న ఆలోచనయే చివరకు సత్ తత్వరూపము దాల్చి అసలు రూపమున ప్రత్యక్షమగును. ఉన్నత స్థితికి చెందిన దివ్యదృష్టి గలవారు దీనినంతను సరిచూచుకొనవచ్చును. ఈ శాస్త్రమునే అనేక పద్ధతులలో బోధింపవచ్చును. కాని మూల సూత్రమన్నిట సమానమే! ఈ శక్తితో భగవంతునితో సన్నిహిత సంబంధ మేర్పరచు కొందుము. అప్పుడప్పుడు కాలానుగుణముగ గొప్ప గొప్ప ఋషుల చేత యిది అభివృద్ధి చేయబడినది. యోగతత్త్వమును విపులముగ చర్చించుచు వ్యాఖ్యానములు వ్రాయబడినవి. వాని సారాంశము మనుష్యుడు తన దృక్పథమును నభివృద్ధి పరచుకొనుటయై యున్నది. ఎవడు తన సూక్ష్మత్వము నభివృద్ధి పరచుకొనునో వానికి విషయముల మాయా స్వరూపములు అవగతమయి వాటి నిజ స్వరూపము గోచరించును. సామాన్యముగ తత్వవేత్తలు ఆధ్యాత్మికతయొక్క ఆంతర్యమును నకారణముగ చర్చించి తెలియ ప్రయత్నించిరి కాని అనుభవ పూర్వకమైన దృష్టితో గాదు. వాడుకలో యుండు హేతువాదము (తర్కము) దోషయుతము కావచ్చును. మనల నపమార్గము పట్టింపవచ్చును. కాని తత్వ విషయము అనవసర సాధనమైన తర్కము లేకుండ అంతర దృష్టితో సూటిగ చూడబడిన యెడల దాని సహజ స్వరూపము మన కవగతమగును. ప్రపంచ విషయములు ఆయా పరిస్థితుల యందు వర్ణింపలేనంత మార్పును పొంది యున్నవి. కొంతమంది సృష్టి శకమును నిర్ణయించుటకు ప్రయత్నించినను అనాదియైన ప్రపంచ జన్మము యొక్క సరియైన తేది గుర్తింపబడనే లేదు. ఆ వృత్తులనేకములుగా జరుగుచు పెరుగచునే యున్నవి. సర్వవస్త్వతీతమైన స్థితి నుండి మనము ఎల్లప్పుడును విషయములను కనిపెట్టుటకు ప్రయత్నించవలెను. విషయ పరిజ్ఞానము సరిగా తెలియవలెనన్న తత్వవేత్తలకు కావలసిన ముఖ్య విషయమిది. పాశ్చాత్య తత్వవేత్తలవలెనే మన తత్వవేత్తలును సామాన్యముగ స్వానుభవము లేకుండగనే విషయములను నిర్ణయించుటకు ప్రయత్నించిరి. ఒకానొక తత్వవేత్త తాను తత్వవేత్త అయినంత మాత్రము చేత, చెడిపోడనిగాని, భ్రష్టపడడని గాని, చెప్పుట సరికాదని నా యభిప్రాయము. కాని స్వనుభవ పూర్వకమైన జీవితము గడపుచు విషయములను పరిశీలించి నట్లయిన చెడిపోవుటకు భ్రష్టు పడుటకును అవకాశముండదు. హిందూ దేశములోని ఋషులు సామాన్యముగ తత్వముచే కోరబడినంత స్థితికి వారభివృద్ధి పొందక పోయినను, మొదట అనుభవ పూర్వకమైన జీవితములో ప్రవేశించియే తత్వ పరిశీలనకు (*తత్వమనునది తర్కముపై గాక అంతర్దృష్టిపై నాధారపడిన విషయము. పాశ్చాత్య తత్వవేత్తలు చెప్పినట్లు సందేహములతో గాక అది ఆశ్చర్యములతో కూడియున్నది. అందుచే విషయముల సత్య స్వరూపము తెలిసికొనుటకు తత్వ మార్గములో అనుభవపూర్వకమైన జీవితము గడపుట యెంతేని యవసరము.*) పూనుకొనిరి. వారు పరోగమించిన

స్థితి నుండి యధాశక్తిగా తత్త్వవిషయ రహస్యములను బహిర్గత మొనర్చుటకు ప్రయత్నించిరి. దాని ఫలితముగా విభిన్నములైన పద్ధతులలో ఆరు రకముల తత్త్వమార్గము లేర్పడినవి. మన అభ్యాసము పూర్తియైన తరువాత మాత్రమే మనము విషయములను వివరించుటకు ప్రయత్నింప వలయును. కొద్దిలో చెప్పవలెనన్న మన "గ్రంథులు" (Knots) వానియంతట నవే విచ్చుకొన ప్రారంభించినపుడు మనము విషయములను గ్రహించుటకు ప్రయత్నించవలెను. అదియే నేను తరువాత చెప్పబోవు కేంద్రప్రాంతము యొక్క దృష్టియై యున్నది. ఆ స్థానము నుండి మన నిర్ణయమునకు వచ్చు ప్రతి విషయమును కించిద్దోషము కూడ లేక యుండును.

# సహజ మార్గము

నేడు నేను రాజయోగపద్ధతి యొక్క అత్యంత ఆశ్చర్యకరమైన ప్రభావమును సహజమార్గము దృష్ట్యా వివరించుచున్నాను. చాల కొద్దిమంది మాత్రమే యీ పద్ధతి యొక్క ప్రభావము నెరుంగుదురు. మానవాతీతమైన ఏకైక శక్తి నొకదానినే మన మూహించెదము. మనము దానిని గురువని కాని ధ్యానవస్తువ (*గురువునే ధ్యానవస్తువుగా స్వీకరించుపద్ధతి నిస్సందేహముగా శక్తివంతమైనదే కాని, ఆ గురువు నిజముగా నున్నత శ్రేణికి చెందినవాడై, అంనతములో లీనమై, ప్రకృతి స్వరూపునిగా మార్పుచెందియున్నపుడు మాత్రమే శక్తివంతమగును. అన్యధాయైనచో అభ్యాసికి వ్యతిరేక ఫలితములు కల్గి వాని యంతిమోద్దేశ్యమున కభ్యంతరము కలుగును.*)ని కాని పిలిచెదము. మానవతీతస్థితిలో గల ఒకానొక వ్యక్తిని మాత్రమే మనము ధ్యానించెదము. వెంటనే మిగిలిన విషయముల ప్రధానములై ఆ ఆకృతికే మనము సంబంధించి యుందుము. ఆ ఏకైక వస్తువునకే మనము ప్రాధాన్యము నిచ్చెదము. ఒక కాలువలోనికి పంపు గొట్టము ద్వారా మనము నీటిని వదలినచో అది గొట్టమునకు మొదట గల యంత్ర సహాయమును పొందుచు దాని స్వశక్తి వలనను కొంతదూరము పోవును. అట్లే సర్వశక్తిమంతుడను కాలువలోనికి ప్రారంభమున మన మనశ్శక్తియను యంత్రము నుంచి, ఆలోచనయను గొట్టముద్వారా పయనించెదము. ఆ మనశ్శక్తి వ్యక్తిగతమైన మనస్సునుండి వచ్చి మన మార్గమును శుభ్రపరచును (సుగమము చేయును) వ్యక్తిగత మనస్సును సరియైన స్థానము నుండి ఒకానొక వస్తువును బయటికి పంపుచున్నామని తలంచెదము. శక్తివేగము దిన దినమునకు పెరుగును. మన వ్యక్తిగత మనస్సు గూడ సద్గతి చెందుచున్న భావము గల్గి, బలవంతమైన చెడు శిక్షణ ప్రభావమును వీడనారంభించును. అది రెండు విధములగు పనుల నెరవేర్చును. వ్యక్తిగత మనస్సను శుభ్రపరచుచునే మానవ జీవిత గమ్య స్థానమును అందుబాటులోనికి తెచ్చును.

ఈ స్థితిని చేరగనే శాశ్వత ప్రశాంత మరియు ఉదాత్త సముద్రములోనికి దూకుట గమనించగలము. ఆ సముద్రపు కెరటముల మధ్య, శాశ్వతముగ నివసించునంతటి ధృఢాభిప్రాయము కల్గగనే, యితరాధోగతి విషయములన్నియు మటుమాయ మగుచున్నట్లనిపించును. ముందేర్పరచుకొన్న ఆలోచనలు తప్ప యితరాలోచనలురావు. తత్ఫలితముగా నీవాదరించు నితర ప్రపంచ విషయములన్నియు, పర్వత శిఖరమున నున్న వానికి లోయలోని వస్తువులవలె అల్పములై గోచరించును. ఆ అల్ప విషయములను నీ వెప్పుడాదరించవో అప్పుడే వాని యందాసక్తియు నుండదు. పోను పోను గమ్యస్థానము కంటికి స్పష్టమై, గోచరించి నీవు సరిగా సూటిగా తలంచిన విషయము తప్ప యితర మేదియు నుండదు. ప్రపంచ విషయ సాంగత్యము నుండి విముక్తుడ వగుదువు. అనగా నీవు

ప్రపంచములో తిరుగుచున్నను ప్రపంచ విషయముల నాదరించవని నా యభిప్రాయము. అట్టి స్వభావము కల్గియున్నంత కాలము యీ స్థితియే కొంతకాలము కొనసాగును. గాఢనిద్రలో నున్న మనుష్యుడు కండూతి భావము (దురద పెట్టుట) నెట్లు సంతృప్తిపరచి ప్రవర్తించునో అట్లే కాలము గడచిన కొలది నీవును స్వతంత్రుడవై ప్రపంచ కార్యముల పట్ల తెలియకయే సంతృప్తికరముగా ప్రవర్తింతువు. పాటకచేరీ విన్పించదు. దగ్గరలో నున్న మరియొకనికి పరధ్యానములో నున్నచో విన్పించి విన్పించనట్లుండును. అతడు సంగీతము పట్ల గాక తన పవిత్ర భావనలోనే నిమగ్నుడగును. ఇట్టి మానసిక స్థితి అతడెట్లు చేకూర్చుకొనును? దీనికి సమాధానము పైన చెప్పినట్లుగ తాను ముఖ్యమని భావించిన విషయమందు నిమగ్నుడగుటయే! అప్పుడు సహజముగా అప్రధాన విషయముల ప్రభావమతనిపై నుండదు. ఇది వైరాగ్య స్థితి (*ఈనాడు వైరాగ్యమనగా ప్రపంచ సంబంధము లేక, సన్యాసి వేషములో సాంసారిక జీవిత విధులన్నిటిని విడచుటయని మాత్రమే సామాన్యముగా భావించబడుచున్నది. ఈ విధముగా బలవంతమైన భౌతిక నిస్సంగత్వము గాని, జీవితావసర విషయముల పట్ల నిర్లక్ష్య ద్వేషములను పెంపొందించుకొనుట గాని, మరి యిట్టి యే యితరమైనది గాని వైరాగ్య మనిపించుకొనదు. మన నిత్య జీవితములో మితిమీరి, ప్రపంచ విషయముల పట్ల విముఖత కల్గియుండు అంతర్గత భావము మాత్రమే వైరాగ్యమనబడును. ఆ విధముగ, సామాన్యుడు కూడ, ప్రపంచ సాంసారిక జీవితమును గడుపుచు, ఆస్తిపాస్తులు కల్గియు, జీవితావసర వస్తువుల ననుభవించుచునే యీ ప్రపంచ జీవితములోనే వైరాగ్యమును సంపాదింపవచ్చును.*). ప్రపంచ విషయముల పట్ల కల్గియున్న అశ్రద్ధభావము ప్రస్తుత మతనికున్న పవిత్ర శాశ్వత సత్వప్రాప్తి భావన తప్ప, మిగిలిన ప్రధానేతర విషయముల ప్రభావమతని హృదయముపై పడకుండ చేయును. అభ్యాసికి తనలోనే తాను తన గమ్యస్థానము వెదకికొనుటయే ముఖ్యమైన విషయము. వైరాగ్యమునై చాలమంది కష్టపడి కృషి చేయుచున్నారు. ఎంత సులభముగా నది యిట లభ్యమైనది! అతని దృష్టి గమ్యస్థానమందు తప్ప అన్యమున లేకుండుటుచే విలువలేని ప్రపంచ విషయముల నన్నిటిని అతడు కోల్పోవును.

రాజయోగ ప్రాథమికాభ్యాసము వలననే నీవు వైరాగ్యమును పొందగల్గితివి. నీ వ్యక్తిగత మనస్సు, ఒక విధముగ శాశ్వతానందస్థితితో జతపర్చబడినది (బంధింపబడినది). మరొక విధముగా చెప్పవలెనన్న నీ వ్యక్తిగత మనస్సు నుండి ఆ యున్నత స్థితి వైపునకు మార్గము నేర్పరచుకొంటివి. అనంత శక్తిమంతుని ప్రశాంతస్థితి యొక్క మృదువైన కెరటములు వ్యక్తిగత మనస్సు వైపునకు ప్రవహించ నారంభించును. అందుచే కొంతకాలమునకు దానితో నేకీభవింప గలవు.

ఇలా మనము ఒకే ఒక దానిని ధ్యానించి మన ఊహకందని యేకైక వస్తువేనది కలదో దానితో సంబంధమేర్పరచుకొనినాము. ఒక అత్యున్నత భావము మన హృదయములో నుండును. సహజముగా మన మట్టి దానిలో నొకభాగమనియో, లేక దానితో పోల్చదగిన ఏ కొద్దిపాటిదనియో

అనుకొందుము. దీనినే మననము చేయుదము. శాశ్వత సత్వప్రాప్తికై తత్ధ్యానముతో మన ఆలోచన ముడివైచి దాని సాధింప నొక మార్గమును కల్పించితిమి. దీని నభ్యసించుచుండగా, అంధకార మేఘములు విడివడి సంకల్ప శక్తి ప్రభావమున శూన్యమేర్పడును. ఆ శక్తి అతివేగముతో విజృంభించును. తత్ఫలితముగ వ్యక్తిగత అస్థిత్వము నశించి మనస్సు మాత్రమే నిలచును. "మహత్" (Godly Mind) స్థితి నుండి విడివడిన భాగము వ్యక్తిగత మనస్సని (చిత్తమని) పిలువబడును. అది విడివడినదని ఏలయను కొందుము? ఎందువల్లననగా మార్గముతప్పి వ్యవహరించుచున్న మన వ్యక్తిగత మనస్సుపై మహత్ ప్రభావము లేకుండుట వలననే! మన మనస్సును ప్రాపంచిక విషయములతో నింది, ఇతః పూర్వ మేర్పడిన విషయ ముద్రలు మాత్రమే కల్గి, సత్‌తత్వము నెంత మాత్రమును తెలిసికొనలేము. ఈ ప్రాపంచిక విషయముద్రలు మిక్కిలి శక్తివంతములై మన యింద్రియములపై స్వారీచేయును. పరిసర ప్రాంతములును మనస్సులో స్థానమేర్పరచుకొనును. ఇప్పుడే మనస్సులో ముఖ్యమై పవిత్రమైన భగవద్భావమును జొప్పించితిమేని, ఇతఃపూర్వముగల విషయముద్రలు పలుచబడ నారంభించి, క్రమక్రమముగ వాని బారినుండి మనము తొలగుదుము. "మహత్" (Big mind) స్థితిలోని ప్రభావము కూడ అనుభవింపబడును. ఇట్లే అభ్యాసము చేయుచున్నచో వ్యక్తిగత మనస్సును, చిచ్ఛక్తివంటి దానినిగా తెలసికొనగలము. నీవెప్పుడేవిధముగ నిశ్చయభావమును నీ మనస్సులో కల్గియుందువో, అప్పుడా మనస్సు యొక్క వ్యక్తిత్వము పోయినట్లుగ భావింపుము. సృష్ట్యారంభమున కేంద్రాధస్థానమందలి కదలిక విపరీతమై తరువాత ప్రపంచావిర్భావమునకు కారణమైనది. ఆ కదలికయే సర్వశక్తిమంతుని ఆది మనస్సు అని (First or Super-mind of the Almighty) పిలువవచ్చును. మనకు పుట్టుకస్థాన మదియే. దాని ప్రథమ మనస్సని పిలువవచ్చును. ఆ ఆది మనస్సునకే వెనుక "కేంద్రము" (Centre) అని పిలువబడు తమ్‌స్థానము (State of Tam) కలదు. ఇది "సహజమార్గ దశా దేశములు వానిపై వాఖ్యానములను" గ్రంథమున (Commentary ont he Ten Commandments of Sahaj Marg) స్పష్టముగా వివరింపబడి యున్నది. నీ వ్యక్తిగత మనస్సను అది మనస్సు యొక్క స్థితికి తీసికొని వచ్చిన, అక్కడ నుండి అది మనస్సు పైకి దుమికి కేంద్ర స్థానమైన భగవంతునిలో ప్రవేశించుటయే మిగిలియుండును. అట్టి స్థితితో నేకీభవించినట్లు తెలిసికొన్నచో సత్యస్వరూపమును తెలిసికొన్నట్లే! అందులో నీవు మున్గి తేలుచుందువు. దాని యంత మెవరికిని తెలియదు. ఆ స్థితి నీకు రాగానే ఎల్లెడల, స్వచ్ఛత, నిరాడంబరత, ప్రశాంతత అనుభవించగలవు. నిర్విరామముగ నట్టి స్థితిలో నివసించ మొదలుపెట్టినపుడు పై మూడు స్థితులు కూడ పోయినట్లనిపించును. అనగా ఆ మూడింటి సంస్కారములు కూడ నీలో నుండవు. ఏకత్వభావమచ్చట పరిపాలింపబడుచున్నది. మన ప్రాథమికాభ్యాసము వలననే దీనిని పొందవచ్చును. ఈ పద్ధతి ప్రభావమును జూచి అభ్యాసము ప్రారంభింపుము.

మనము సామాన్యముగా మానవాకారమును ధ్యానింపవలసినదిగా నొక్కి చెప్పుదుము. బహుశః విమర్శకులు దానిని ఆధ్యాత్మికానుభూతికి ఆత్మహత్య వంటి దానినిగా పరిగణింపవచ్చును. ఆ ధ్యానింపబడు మనుష్యుడు ఒక ప్రత్యేక తరగతికి చెందినవాడై, ఆధ్యాత్మిక శిక్షణ నిచ్చుటకై నిర్గుణ బ్రహ్మ (Immaterial Absolute) నుండి వచ్చిన వాడైనను లేక స్వయంకృషితో, శిక్షణ నిచ్చుటకు తగిన ఆధ్యాత్మిక పరిణతి పొందిన వాడైనను నష్టముండదు. మనము యు.పి. ఫతేఘర్‌కు చెందిన సమర్థగురు శ్రీ మహాత్మారామచంద్రజీ మహారాజు గారిని ఉదాహరణముగా తీసికొందుము. ఈయన విషయము కొలది కాలములోనే ప్రకాశితమై ప్రపంచ మా తరువాత నెల్లప్పుడును అతనిని గుర్తుంచుకొనును. అతడు ప్రకృతితో నేకమై యున్నాడు. అట్టి గొప్ప మహాత్ముని ధ్యానించిన యెడల మనము వెదకుచున్న వస్తువు దానియంతటనదే వచ్చును. రేఖాగణిత పద్ధతిలో చెప్పవలెనన్న A, B కి సమానమై, C, A తో సమానమైన, C, B తో సమానమగును. అట్టి వానిని మీరు గురువుగా నెన్నుకొన్నచో మీ జీవిత సమస్య సులువుగా పరిష్కరింపబడును. నేనొక ఉదాహరణ మిచ్చెదను. అర్జునుడు కృష్ణుని "నిన్ను పూజించువారు కొందరు, భగవంతుని పూజించువారు కొందరు. ఇందులో ఎవరు గొప్ప యోగులు?" అని యడిగెను. కృష్ణభగవానుడు "స్థిర విశ్వాసముతో నన్ను పూజించువారు ఉత్తమయోగులు. సర్వవ్యాపి, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడునైన నిర్గుణ బ్రహ్మ నుపాసించు వారు ఎక్కువ కష్టపడవలసి వచ్చును. ఎందువల్ల ననగా, నిజానికి ఈ మార్గము అతి కష్టము. స్వయంకృషితో నొక వ్యక్తి దీనిని దాటుట దుస్సాధ్యము" అని సమాధానమిడెను. మన ధ్యేయ వస్తువగు, అట్టి మహాత్ముని ప్రేమించితిమేని, అతనికి అత్యద్భుత శక్తులుండుటచే, ప్రకృతి శక్తి అతని గుండా మనకు ప్రసరించును. చెడు ప్రవర్తనచే పాడైన మన భావములు, అనుభవములు, స్వస్వరూపముల దాల్చి పరమ పవిత్రములగును. స్వస్వరూపములనగా మొట్టమొదటగా మానవాకారమును దాల్చునప్పటి స్థితులని నా యభిప్రాయము. మన లోక వ్యవహారములు అనియతము లగుట చేతను, మనస్సు శిక్షణ లేని దగుట చేతను, అట్టి మహాత్ముని లేక మహానుభావుని శరణు వేడెదము.

# ధ్యానము

రాజయోగములో మనము సామాన్యముగా ధ్యానముతో ప్రారంభించెదము. అట్లు చేయుటలో గొప్ప తత్వార్థము గలదు. ప్రపంచ విషయములతో మనమెప్పుడును తీరికలేక యుందుము. మనమేమియు చేయకున్నచో, తీరిక సమయములో మన భావములకు రెక్కలున్నట్లు అనిపించును. మనమెల్లప్పుడును నియమరహితమై, గందరగోళములో నుందుము. మన వ్యక్తిగత మనస్సు అట్టి స్వభావమున కలవాటు పడినది. మన మా విధముగనంతయు తలక్రిందులు చేసితిమి. మన పనులు, ఆలోచనలు చెడు ప్రవర్తనలో ఎక్కువ బాధ్యత వహించును. వివిధాలోచనలతో సంబంధము పెట్టుకొన్నచో మన తీవ్రానుభవముల మీద ఇంద్రియముల మీద వాని భావ ముద్ర పడును. ఇంద్రియములన్నియు పాడై, చెడుత్రోవ పట్టును. అది చాలాకాలము కొనసాగగనే వానిని మరింత చెడగొట్టుదుము. ఆ విధముగ నింద్రియాదులపై బడిన మచ్చలు, వానిని విజ్ఞానవివేకములు లేని రాళ్ళ వలె ఘనీభవింప చేయును. ఆత్మకు నిస్సందేహముగా నట్టి మార్పుండదు. కాని ఆటంకములు సంస్కారములు మొదలగు వానిచే, పట్టు పురుగు చుట్టు గూడేర్పడినట్లు ఆత్మ కప్పబడియుండును. అప్పుడేమి సంభవించును? ఆత్మ వైపు తొంగి కూడ చూడలేము. ఇక దానిని తెలిసికొనుట యెట్లు? క్రూర భావముల, వ్యవహారముల ఫలితముగ మనము వివేకమును, సరియైన జ్ఞానమును చెడగొట్టుకొందుము. ఈ స్థౌల్యస్థితిని, పైన చెప్పిన రీతిగా, చేరుకొన్నవారు రాజయోగపద్ధతి నంగీకరించుట కిష్టపడరు. అందుచేతనే కొందరు ప్రజలు మనము చెప్పినదానిని వినిపించుకొనరు. ఏదో ఒక విధముగ భగవంతుని చేర వారు కృతనిశ్చయులై యున్నచో, గురుశక్తి వారిపై పనిచేయును. ఈ సందర్భములో, ఆవరించియున్న పొరలను చీల్చి, చిక్కులను తొలగించగల "ప్రాణాహుతి" శక్తి గల గురు సహాయము వల్ల మాత్రమే వారి పరిస్థితి చక్కబడునని చెప్పగోరుచున్నాను. (అలంకారికముగ పద్మములని (Lotuses) పిలువబడు) చక్రముల (Chakras)పై ధ్యానము చేయవలసినదిగా అభ్యాసికి చెప్పబడును. మనము సామాన్యముగ హృదయమందు ధ్యానము నిల్పెదము. హృదయము రక్తప్రసారణ కేంద్రము. రక్తమును పరిశుభ్రము చేసి వివిధ నరములకు, కణముల కది ప్రసారము చేయును. ఇప్పుడు ధ్యాన కేంద్రముగా హృదయమును తీసికొన్నాము. శరీరమున ప్రవహించు రక్తమంతయు తత్ప్రభావము కల్గియుండును. మన ఆలోచనలవల్ల, వ్యవహారముల వల్ల ఏర్పడిన స్థౌల్యము కరగిపోవును. హృదయముపై ధ్యానము నిల్పిన మొదటి దినముననే మనము పొందగల మొదటి లాభమిది. రాజయోగ ప్రాథమిక దశలో ధ్యానము చేయవలసిన అవసరమేమియని కొందరు ప్రశ్నింపవచ్చును. సమాధానము సులభము, స్పష్టమునై యున్నది. చంచల స్వభావమున కలవాటు పడిన మన వ్యక్తిగత మనస్సును ఒక స్థానములో

నిల్పుటకు ప్రయత్నించుచున్నాము. ఈ అభ్యాసము వలన మన వ్యక్తిగత మనస్సును సరియైన మార్గములో ఉంచుచున్నాము. ఎందువల్లననగా నది దీని స్వభావమును మార్చుకొనుచున్నది. దీనియనంతరము సహజముగా మన ఆలోచనలు తప్పుడు మార్గమునకు పోవు. మనము మొదట జన్మించినపుడు సంపూర్ణుల మనియు, సర్వశక్తిమంతునితో మన మందరము సన్నిహిత సంబంధము కల్గియున్నామనియు, హిందువుల విశ్వాసమే కాక నిజము కూడనై యున్నది. మనము కాలము గడచినకొలది క్షీణించి, తత్ఫలితముగ నేడు మానవత్వము యొక్క అధమస్థితిలో నున్నాము. మనలోని యీ మార్పునకు కారణమెవరు? మనమే గాని మరెవ్వరును గారు. మనల నంతర్గతముగ చెడగొట్టుకొన్నదియు మనమే! భగవత్సామ్రాజ్యమునకు దూరముగ అంధకారకూపములో పడద్రోసి కొన్నదియు మనమే! మనలో నీ నాశము కల్గించుకొని మన చెడ్డ నడతలు, చెడ్డ ఊహలతో వల నల్లుకొని అందులో చిక్కించుకొన్నదియు మనమే! ఇప్పుడు మనము "అధోముఖ" చలనము (Downward Motion)తో మొదట అవతరించిన స్థితికి తిరిగిచేరవలెనని కోరుచున్నాము. సర్వశక్తిమంతుడు జగత్తును సృష్టించుటకు కేంద్రాధస్థానమున చైతన్యము కలుగజేసెను. వివిధ వర్ణముల దారాములతో నల్లిన వల వలె, ఆ సృష్టిని పూర్తి చేయుటకు తన సంకల్ప బలము ఉపయోగించినాడు. సృష్టికి పూర్వము అది అతనితో ఏకమయియుండెను. సృష్టిలేనపుడు మన మనశ్శక్తియు, భగవన్మనశ్శక్తియు నొక్కటే. ఈ జీవులు క్రిందకు వచ్చినను మరల తిరిగి వానిలో ప్రవేశించినను కేంద్రము (తరువాత ఈ గ్రంథములో చెప్పబడినది) నందు చేరినను, అతడు మాత్రము కేంద్రము వద్దనే యున్నాడు. అట్లవతరించిన మనమురంగు రంగుల ఆలోచనల దారములతో వల నల్లుకొని అందులోనే యింతకాలము నుంటిమి. ఇప్పుడు మనము మన కేంద్రమునకు పోదలచినాము. దానికై జీవములన్నిటిని మొదటి స్థితికి తీసికొని వెళ్ళుట సహజ పద్ధతి. మన మవతరించు సమయముననున్న మన ప్రళయ స్థితిని కల్పించుకొనుటకే మనము ధ్యానములో మనస్సు నిచ్చలముగ నొకే స్థానము నొద్ద చేరునట్లు చేయు ప్రయత్నింతుము. ధ్యానములో హృదయమందు దృఢ సంకల్పము కల్గియుందుము. అది దాని పరిసరములకును వ్యాపించును. అక్కడ నుండి మన సంకల్పము శరీరమందలి చక్రముల కన్నింటి వరకు వ్యాపింప నారంభించును. ఆ విధముగ నన్ని చక్రములు ప్రకాశింప నారంభించును. మన సంకల్ప వృత్తము వివిధ ప్రాంతముల గుండా బోవుచు చిట్టచివరకు అత్యంతాంతర్గత వృత్తమున నిమగ్నముగా నారంభించును. అచ్చట కొన్ని సమయములందు మిరుమిట్లు గొల్పు కాంతిని చూడగలము. ఎందువల్ల ననగా నీ హృదయము నుండి ప్రస్తుతము నీవున్న స్థానము వరకు నీవొక మార్గమేర్పచుకొంటివి. ఆ తరువాత నీవు పురోగమించుచున్న కొలది ఆ కాంతి అదృశ్యమై పోవును. అంతేకాక వివిధ మాయా స్థితులతో నీకు సంబంధము కల్గును. ఆ మిరుమిట్లు గొల్పు కాంతి అచ్చటనే ఉండును. దానిని దాటగనే పూర్తి ప్రశాంత వాతావరణములో నున్నట్లు తెలిసికొనగలము.

ఇచ్చట భగవత్సామ్రాజ్యము ప్రారంభమగును. ఆ తరువాత వివిధములైన స్థితులగుండా మనమందరము పోవలసియున్నది. అవియన్నియు ఈ సందర్భమున ధ్యానము అను శీర్షిక క్రింద చర్చించుట అనవసరమగుటచే విడిచి వేయుదుము. ఇప్పుడు నీ ధ్యానము నిన్ను ముఖ్య గమ్యస్థానమునకు తీసికొని పోవుచున్నది. హఠయోగాభ్యాస మిట్టి ఫలితము నీయజాలదు. "ఆజ్ఞా" చక్రము తరువాత అది పనిచేయదు. (రాజయోగము యొక్క భాగమైన ధ్యానము) ఇది మాత్రమే నిన్ను చివరకు తీసికొని పోవును. కేంద్రమును జేరుట కన్యోపాయము లేదు. కేంద్రము నుండి వచ్చిన యొక సంకల్పమే యింత పెద్ద ప్రపంచమును సృష్టించినదని తెలిసికొంటిమి. మన చెడు ప్రవర్తనచే పాడైపోయినను, అట్టి కేంద్రశక్తియే మనయందును గలదు. సహజమగు ఆ శక్తినే మన ముపయోగించెదము. ధ్యానము ద్వారా ఆ శక్తి నుండియే పనిచేయుదుము. ఈ విధముగ, సహజముగా, ప్రకృతి శక్తితోనే ముందునకు సాగుదుము.

మనము ధ్యానించు సమయమున మనలోని కేంద్ర శక్తి జాగృతమగును. మూగుచున్న మేఘముల నది తొలగించి, నశింపజేయును. అభ్యాసికి మాత్రమే అది తెలియును. అనుభవ పూర్వకముగా మాత్రమే యిది తెలియనగును. వెంటనే శాశ్వతానందమున ఈదులాడుచున్నట్లు గమనిపగలవు. సర్వము నిక్కడ నంతమగును. ఇచ్చట ప్రపంచముతో సంబంధముండదు. మనస్సు శిక్షితమైనది. దానియంతటనదే క్రమబద్ధమగును. ఇంద్రియములు వశము కానారంభించును. వానిపై నీకాధిపత్యము వచ్చును. నీపై నీకు ఆధిపత్యమనగా, ప్రకృతిపై ఆధిపత్యమన్నమాట. మార్గము సుగమము కాగానే, ప్రకృతికృషి నీ అధీనములో నున్నట్లు కన్గొనగలవు. అనగా నీయంతట నీవే పని ప్రారంభింతువు.

# హృదయ ప్రాంతము

హృదయము రక్త మాంసములతో నేర్పడినది మాత్రమేయని సామాన్యముగా ప్రజలు తలంచెదరు. హృదయమన్న భావమెప్పుడు వచ్చినను, వారు దాని స్థితిని పై విధముగనే తలంచెదరు. హృదయప్రాంత సమగ్ర పరిశీలనలో నిది యొక పరిమితిని మాత్రమే తెలియజేయును. అది నిజానికి బాహ్యాంతర విషయములన్నింటిని ఇముడ్చుకొన్న ఒక విశాల వృత్తము. అది మనస్సు తరువాతి స్థితి యంతయు హృదయ ప్రాంతమునకే చెందును. సమస్త ''చక్రములు'' దాని పరిధిలోనే నిర్మింపబడినవి. మరొక విధముగ చెప్పవలెనన్న ఆ చక్రములన్నియు హృదయ ప్రాంతములో నొక భాగమున వచ్చును. మానవుడు దాటగల సమస్త స్థితులు దానియందు దాగియున్నవి. అధిచేతన (Super Consciousness) అచ్చట గలదు. ''సుషుప్తి'' దానిలో నొక భాగము. నీటిలో బాతుల వలె మనమంతరము ఆ ప్రాంతములో నాడుకొనుచున్నాము. ఉత్తమగతి నొందిన ముక్త జీవములతో పరస్పరము సంభాషించగల స్థితి ఇచ్చటనే బయలుదేరును. వ్యక్తిగత మనస్సు యీ ప్రాంతముననే తనపాత్ర నటించును. అది భగవంతుని ముఖ్య రక్తనాళము. దాని గుండా పోనిచో మనము భగవంతుని చేరలేము. నారదుడీ ప్రాంతమున భగవత్సంకీర్తనము చేయుచుండును. ఎక్కువమంది ప్రజలు తమ శరీరమును తప్ప మరేమియు తెలిసికొనరు. వారి ఆలోచనల్నియు దానిపైనే కేంద్రీకరించి యుండును. శరీరమొక్కటి మాత్రమే కాపాడుకొన దగినదిగా వారు భావింతురు. వారికదే సమస్తము. వారి శరీరము నశించుట వారి కిష్టముండదు. రోగగ్రస్థము కాగానే వైద్యుల చుట్టు మూగుదురు. శరీరరక్షణమే వారి సర్వస్వముగా భావించెదరు. వారిలో ఊగులాడుచున్న యీ భావముల నుండి వారు స్వతంత్రము కాగోరరు. యజమానియైన శరీరమునకే వారు సేవ చేయుచున్నట్లుందురు. వారి దృష్టిలో ఆత్మకు విలువలేదు. వారి కది అప్రధాన విషయము. పైగా వారికి తీరిక సమయ ముండదు. వారి శరీరము చుట్టు ఎన్ని వృత్తముల నేర్పరచుకొనిరో! అసలు శరీరమే స్థూలమైనది. దానిపై పదేపదే సుత్తి దెబ్బలు కొట్టి దానినింకను ఘనీభవింప జేసిరి. వారి భావము లిప్పుడెక్కడ నుండును? శరీరముపైనా? లేక లోపలనా? ఒకానొక విషయమును నొక్కి చెప్పునపుడు ఇదివరలో దానిని గురించి ఏర్పరచుకొన్న భావముల కనుగుణముగా అభిప్రాయములు దుముకుచూ జ్ఞప్తికి వచ్చును. అది శరీరము గురించి కృషి చేయు భావము. అంటే ఇప్పుడు శరీరమునకై కృషి చేయుచున్నావు. అట్టి శరీరముతో బంధము కల్గి దానినింకను స్థూలతరము చేయుదువు. సహజముగా స్థూల శరీరమునుండి (తాకి) వచ్చిన భావములును స్థూలములే యగును. ఏదో విధమగు శరీర సంబంధ

భావము లుండుటచే అంతర్గతముగా కొంత స్థౌల్యము కలదు. పరస్పర స్థౌల్య సంబంధము కల్గి అవి శరీరములోనే ఏకీభవించినవి. ఇప్పుడు నీవు లోపల అక్షము గల్గి, ధృవములు గల ఒక ఘన గోళమువలె నిర్వచింపబడదగి యుందువు. శరీరమునందలి కొన్ని అవయవములు నీ వెరుంగుదువు. గుండె కొట్టుకొనుట నీకు తెలియును. ఉఛ్వాసనిశ్వాసములను గుర్తింపగలవు. వీని యన్నిటిని కొన్ని అవయవములు పని చేయుచుండుటతో ముడిపెట్టదవు. ఈ అవయవములన్నియు శరీరమందలి వివిధ స్థలములలో అమర్చబడినవనియు మీకు తెలియును. కాలేయము, హృదయము, ఊపిరితిత్తులు అననేమియో మీకు తెలియును. మీరు నిజముగా స్థూల శరీరము యొక్క పాత్రతో ఏకమై అభినయించు చున్నారు. ఇది తప్ప మీ మనసులో నేమియు నుండదు. నిజమైన వస్తుతత్వములు మీకు తెలియవు. ఈ నాటకములన్నియు నెక్కడ ఆడబడుచున్నవో మీకు తెలియవు. మీ భావములలోనే మీరెగురుచున్నారని మీకు తెలియదు. మీకు మీరే మార్గమును పూర్తిగ తప్పి చెడిపోతిరి. ఇవన్నియు నెందువలన సంభవించినవి? అట్టి భావములు మనస్సులో మెరయనేల? వాని రాక కాధారమేమి? వీని కళ్ళెములన్నియు నెవరి హస్తములందున్నవి? లేక వీని పరిపాలకు డెవ్వడు? హృదయమే గాని మరెవ్వరును గాదు. మీకు మీరే హృదయమును యీ విధముగా మార్చుకొని యిట్టి ఫలితములను గొనితెచ్చు కొంటిరి. దీని తరువాత ఫలితము కలత చెందుట మాత్రమే! ఈ ఆలోచనలన్నియు హృదయము వలన కల్గును. తరువాత మీ ప్రవర్తనలన్నియు హృదయము చేత మాత్రమే ఆజ్ఞాపింపబడి క్రమపరుపబడును. మొట్టమొదటనే తెలివి తక్కువగా చేసినచో చెడిపోవుటకును, తెలివిగా చేసినచో బాగుపడుటకును, హృదయమే బాధ్యత వహించును. అనగా నన్నింటికి హృదయమే యజమాని. దానికదే నియమనకారి. మీలో గల హృదయ పరిస్థితి యిట్టిది. వివిధ మార్గములలో చిత్ర విచిత్రముగా నది పనిచేయుచున్నది. సృష్టి చేయు సంకల్పముతో నున్న సర్వశక్తిమంతుని ముఖ్య రక్తనాళము దాని గుండా పనిచేయుచున్నది. మీ హృదయము లోలకమువలె కొట్టుకొనుటకు కేంద్రాథోభాగమున అదృశ్య చలనము యొక్క ఫలితమే కాని అన్యము గాదు. అట్టి అదృశ్య చలనములతో సంబంధము కల్గియుండుటచే యధాశక్తిగా తన స్థలములో హృదయమును అట్టి పనియే చేయుచున్నది. ఆ విధముగా కేంద్రాథోభాగమున అదృశ్యచలనము చేయుపని యెట్టిదో దాదాపు యిదియు నట్టిదే! ఓహూ! చూడుడు! భగవంతుని అదృశ్య చైతన్యమునకు దృశ్యమాన రూపమిదియే! ఇది మహా సముద్రపు నీటిబొట్టు. ఇదియు కేంద్రము నుండి వచ్చిన యొక అంశము మాత్రమే! పరిమిత భావముతో నా శక్తియే యిది. ఆ చైతన్యమంత శక్తివంతమైనది. పరిమితి మీ సంకుచిత స్వభావ ఫలితముగా నేర్పడినదే. అదృశ్య చలనములు ప్రపంచ సృష్టికి ప్రధాన నాళము నుండి అవతరించి, విశాలాకాశ వృత్తము నందు తుంపరలుగా వ్యాపించినవి.

నిస్సందేహముగా వృత్తాకారములో తిరుగు ఈ చలనములు ప్రపంచము నేర్పరచినవి. మన చుట్టును సర్వశక్తిమంతునిచే సృష్టింపబడిన ఆకృతులను అదృశ్య చలనములేయని గ్రహింపగలము. ప్రపంచములోని కత్యద్భుత ఫలితములను దెచ్చిన ఆ మహాశక్తితో మనకు సంబంధము గలదని యిది స్పష్టము చేయును. ఆ విధముగ ప్రపంచములోని సర్వ పదార్థములు ఒకదాని కొకటి సంబంధము లేనట్లు కన్పించినను, తుదకివియన్నియు ఆ యొకే వస్తువునకు సంబంధించియే యున్నవి. ఆ విశాల వృత్తము గుండా సంచరించు వానిలో మన హృదయము కూడ నొక భాగమని గ్రహింపగలము. మన సంకల్ప శక్తి చేతనే మనము పరిమితులను కల్పించుకొంటిమి. అందుచేతనే మన హృదయము యొక్క అంతర్వృత్తము, పైన చెప్పి వానినుండి విడివడినట్లు కనుగొందుము. ప్రతీది యీ ప్రాంతములో నుండునదే. జీవరాసులన్నియు, మార్పునొంది బయలుదేరిన స్థలమును చేరుకొన్నపుడు ప్రళయము వచ్చును. జీవులు (సర్వ వస్తువులు) ప్రస్తుత స్థితిని పొందుటకు ముందు, వృత్తాకారపు కదలికలు కొన్ని స్థలములందెక్కువగను, కొన్ని స్థలములందు తక్కువగను కల్గును. విద్యుచ్ఛక్తిని పెంపుజేయు బ్రాకెట్ల వలె పై స్థానములు నిరోధక శక్తిని పెంపొందింప జేయుటకు తోడ్పడును. అట్టి ప్రతి బ్రాకెట్ అది చేయు పనిని బట్టి ప్రత్యేక నామము గల పద్మము (చక్రము)గా గుర్తింపబడినది. అందుచే నవియన్నియు హృదయప్రాంతమని పిలువబడు వృత్తములో నిండియున్నవి. ఇందు ప్రతి చక్రమును చేయుపనులు ప్రత్యేకముగా నుండును. మానవుల ఆధ్యాత్మికాభివృద్ధి కొంతవరకు ఉప వృత్తములపై నాధారపడి యున్నది.

ఏదోవిధముగా పెద్ద వృత్తము దాటితిమేని యిక మనకు మిగిలినది ఈ సృష్టికి కారణమైన ఆది మనస్సే! వాని వెనుక జీవిత గమ్యస్థానమగు కేంద్రము గలదు. ఆ కేందస్థానము ఒక పెద్ద కోడిగ్రుడ్డు ఆకారమును గలిగి యుండును. ఎందువల్లననగా సకల చలనములు ఆ విధముగానే కదలును. దాని క్రింద నేదో యున్నదని మనమేల యనుకొందుము? భగవచ్ఛక్తి ప్రవాహము ఈ ప్రాంతమున నిండుగా ప్రవహించును. దాని క్రింద నొక గొప్ప పరమ రహస్య మిమిడియున్నది. నీవొక చీకటి ప్రాంతములోనికి వెళ్ళినపుడు కన్పించు కణముల వంటివి యీ చైతన్యపు కదలికల కారణముగా అచ్చట ఉన్నవి. ఇది నీ జీవితములో నిత్యము జరుగుచునే ఉండును. నీవొక చీకటి గదిలోనికేగినపుడు గుండ్రని కాంతి పుంజములను చూడగలవు. ఇవియన్నియు పవిత్ర భగవత్ప్రాంతములోను గలవు. ఆ వృత్తములోగల యీ కాంతి పుంజములు వివిధ శక్తులు గలవై యున్నవి. నీవు రాజయోగము ద్వారా పురోగమించినపుడు అవి పూర్తిగ అంతమగువరకు కరిగిపోవును. ఈ వృత్తము పై భాగమును చేరగనే అభ్యాసికి, రకరకముల శక్తులు కలుగ నారంభించును. ఒక్కొక్క గ్రంథి విడివడుట యనగా ఒక్కొక్క శక్తి వచ్చుట యన్నమాట. సమర్థుడైన

రాజయోగ గురువు పై భాగము మృదువుగా నుండుటకు వాని నణచివేయును. ఆ విధముగా నణచుటవలన కల్గిన శక్తి అభ్యాసికి దానియంతటదే వచ్చును. పై నుండి వచ్చునట్టి చలన ఫలితమే అట్టి ప్రతికాంతి కణము. వీనినన్నింటిని పూర్తిగా నశింపజేసికొన్నచో మొట్ట మొదటగా నీవీ ప్రపంచములోనికి వచ్చుటకు ముందున్న ప్రశాంతతను అనుభవించగలవు. ఎల్లెడల శాంతి వ్యాపించును. నిరాడంబరత్వము సమీపములో నుండును. ఫలితము స్వచ్ఛత. హృదయ ప్రాంతము నందలి ఉపవృత్తములలో బ్రాకెట్లును (నిరోధకములును) భగవంతుడొసంగియున్నాడు. అవి సడలుట ప్రారంభించి, వాటి ఉనికి చూసిన తర్వాత ఆగిపోవును. చక్రముల ప్రభావమింకెంత మాత్రము నుండదు. అన్ని ప్రతిబంధకములను నీవు తొలగించెదవు. ప్రతి పనికి ఫలితముండుట సహజముగాన, ప్రతిబంధక మొక్కొక్కటి తొలగగనే, ఒక్కొక్క ఫలితము వచ్చును. చక్రములలో మూల మూలలందున్న కిరణములు అదృశ్యము కాజొచ్చును. సత్యవస్తువుతో పదార్థ సమ్మేళనములో వచ్చిన కాంతి క్రమక్రమముగా తగ్గుచు పూర్తిగ నదృశ్యమగును. ఇంక ఈ హృదయ ప్రాంతములో మిఱుమిట్లుగొల్పు కాంతిగల భాగములు కొన్నిగలవు. కొన్ని సంస్థలలో ప్రజలు కొన్ని సమయములందీ కాంతినికూడ ధ్యానించెదరు. కాంతినే సరియైనదానిగా తలంచి కుతూహలముగా, పూర్తి సంకల్పముతో వెంబడించెదరు. ఫలితముగా ఈ కాంతి ఎక్కువగా లోపల ప్రవేశించుట కవకాశము కల్పించుచున్నారు. కాంతి శక్తి పట్టుటకు స్థలమున్నంతవరకు నిస్సందేహముగా పెరుగును. కాని నిజము చెప్పవలెనన్న, వారు స్థూలరూపములోనున్న "మాయ" యొక్క అంచున ఉన్నారు. కాంతికి నేను "స్థూల"మను పదమును ఉపయోగించాను. శాస్త్రజ్ఞులు దానిని వ్యతిరేకించవచ్చు గాని, కాంతియు చీకటియు గాని సత్‌తత్వము దృష్ట్యా వారు సరిగా ఆలోచించినచో మొదటిది రెండవద దానికంటె భారమని గ్రహించెదరు. ఇది సామాన్యముగ "త్రికుటి"లోను తరువాతను సంభవించును. శరీరము యొక్క పైభాగము యీ పెద్ద వృత్తము యొక్క చివరనేయున్నది. ఈ పెద్ద వృత్తముయొక్క రంగ మటువంటిది. కేవల మనుభవింపదగిన అనేక విషయములీ విశాల వృత్తమున గలవు. మాటలతో వానిని చెప్పలేము. ప్రకృతి యొక్క వివిధ శక్తుల నిచ్చట నివసించును. అత్రి ఋషి యిచ్చట తన బాధ్యత నిర్వర్తించుచున్నాడు. వేలకొలది సంవత్సరములు గడచినను, యీ వృత్తమును దాటి యితడు పైకేగలేదు. అగస్త్య ఋషి యీ ప్రాంతముననే వర్తించుచున్నాడు. ఈ ప్రాంతమును దాటిన వ్యక్తినుండి వారాజ్ఞలను పొందుచున్నారు. వీరేగాక యీ ప్రాంతముననే పనిచేయు ఋషులనేకులున్నారు. నేనొక ప్రకృతి రహస్యము చెప్పుచున్నాను. విష్ణుమూర్తిని దైవముగా పూజించుచున్నాము. ఇవ్వేళ అతని శక్తిని తెలియజేయుదును. అతను సృష్టిని రక్షించుటకై, వివిధ కణములను, సరియైన రీతిలో నుంచుచున్నాడు. అతని కృషియంతయు ఈ వృత్తము లోపలనే యున్నది. ఈ వృత్తమును


దాటితినని చెప్పగల దేవుడెవ్వడును లేడు. శక్తిని స్వాధీనపరచు కొని సాధనమును చేకూర్చుకొన్నచో, దేవతలకంటె నత్యున్నత దశకు మానవుడు మాత్రమే పోగలడు. నిజానికి మన స్వాధీనములోగల శక్తిచే దేవదతలకు, మనమేశక్తిని చేకూర్చుచున్నాము. "మన"మనగా ఈ ప్రాంతమును (అనగా హృదయ ప్రాంతమును దాటి మహత్‌లో చేరినవారు) దాటినవారని నా అభిప్రాయము. అంతేకాదు. ఆది మనస్సును కూడ దాటిన వారని చెప్పవలెను. అప్పటికిని సరిపోదు. ఆది మనస్సును దాటికూడ చాలదూరము కడచినవారని తప్పక చెప్పవలెను.

గురూపదేశము ననుసరించి పెద్దదైన హృదయ ప్రాంతముదాటుట సులభమైయున్నది. కాని ఆ గురువు అన్ని ప్రాంతములను దాటి పైకేగినవాడై మరియు ప్రాణాహుతి శక్తి కల్గినవాడైనచో మాత్రమే అట్టి సమర్థద గలవాడగునన్నది గుర్తుంచుకొనును. అభ్యాసి పక్షమున, దృఢ సంకల్పము యున్నది. నిస్సందేహముగా కావలయును. ఈ విషయము కన్పించినంత కష్టముగా నుండదు. సూక్ష్మమైన వస్తువును సాధించుటకు అభ్యాసకులు క్లిష్టపద్ధతుల ననుసరించెదరు. అది యీ మార్గములో ముఖ్యాటంకముగా నున్నది. ఈ పెద్ద ప్రాంతమునకు చేర్చు నిచ్చెనలో కింది మెట్లపైనే నారదుడుండును. హృదయ ప్రాంతములో నొకమూల, నిస్సందేహముగా నారదుడు వీణ వాయించుచుండును. హృదయములో నుత్పత్తియగు తక్కువరకపు శబ్దములో నతడు నిమగ్నుడయ్యెను. ఇంక మిగిలిన పెద్ద పెద్ద ఋషులసంగతి చెప్పదలచు కొనలేదు. వారి నిజస్థితి తెల్పినచో ప్రజలు నాపై విరచుకొని పడుదురని భయపడుచున్నాను. కాని యతడెవ్వడైన కానిండు. నా ప్రతినిధికి మాత్రము ఈ విషయములు నేను స్పష్టపరచవచ్చును. నేను చాల విషయములు బయటపెట్టవలసియున్నది. అందులో కొన్ని నా జీవితకాలములోనే ప్రకాశితమగును. భౌతికదేహము పోయిన తరువాత కొన్ని బయటికి రాగలవు.

హృదయప్రాంతము దాదాపు ఆపాదమస్తకము వ్యాపించియున్నది. భగవంతుని సర్వసృష్టియు ఈ వృత్తములోపలనే యున్నది. ఈ పని విభజింపబడి వివిధ ఇంద్రియములచే చేయబడుచున్నది. హృదయప్రాంత మందలి మధ్య భాగమునకు కిందుగాపోయినచో నెంతోమంది పనిచేయుచున్నట్లు గమనింపగలము. ఆ పనులు వాని వానికి నియతములైన పద్ధతిలో జరుగును. భగవచ్ఛక్తులను వారిలో గమనింపగలము. ఆ శక్తులు యధాతథముగా ఉపయోగింపబడును. ఇది యొక పెద్ద ప్రకృతి యంత్రాగారము.


భౌతికత్వము నధికగమించి, స్వయంకల్పిత శక్తిని నిశ్శేషము చేసిన, సృష్ట్యాదినున్న స్థితిని నీవు చేరుదువు. దీనినే తిప్పి చెప్పవలెనన్న ఈ హృదయ ప్రాంతమందలి గ్రంథులను విడదీసికొన్నచో శాంతి వ్యాపించి, ప్రాముఖ్యము వహించును. అచ్చటగల ప్రతియొక్కటిలోనూ (ఇప్పుడచట

మూల స్వరూపమున్నది) ప్రశాంతత అధికతరమగుట కన్పించును. నీచే సృష్టిపంబడిన దేమియు నుండదు. కణములు మొదలగునవి అదృశ్యమగును. మెఱుపు కాంతికూడ తగ్గి క్రమక్రమముగా నదృశ్యమగును. ఇప్పుడు భారమేమియు నుండదు. దానియందలి సత్యమును గ్రహించుస్థితికి రాని ఆత్మకు ఆ అనుభవము ఊహాతీతమేయగును. ఆత్మకు తన్నుతాను తెలిసికొనవలెనన్న కోరిక ఎప్పుడు నుండును. కేంద్రముతో నేకీభవించినపుడే అది సాధ్యమగును. బాహ్య విషయములు (ఈ స్థానమందలి పైపొరలు) ఇక నెంత మాత్రము నుండవు. ఈ పెద్ద హృదయ ప్రాంతములో విశ్వశక్తులు (Cosmic Powers) నివసించును. ఈ ప్రాంతముదాటి భగవన్మనస్సు చేరుటకు ముందు భగవత్కృషిలో ఉపయోగించు అనేక శక్తులను పొందగలవు. ఆ శక్తులను గురించి యీ పుస్తకములో నేను చర్చించుటలేదు.



1వ పటము

ఈ హృదయప్రాంతము గురించి నేను వివరించు చున్నాను. దానిని మీరు నా పరిశోధన యనియో, లేక కనిపెట్టబడిన విషయమనియో, లేక కొంగ్రొత్త విషయమనియో మీ యిష్టము వచ్చినట్లు పిలువుడు. రక్తమాంసములతో చేయబడిన హృదయమును 1వ పటములో చూపబడినట్లు రెండు భాగములు చేయుదును. వృత్తాకారమందలి 'U' అని గుర్తింపబడిన మొదటి భాగము 'L' అని గుర్తింపబడిన మిగిలిన దానికంటె ప్రకాశవంతమైనది. ఇచ్చట మూడుస్థానములు గలవు. ఒకటి పైన, రెండవది కింది, ఆ రెంటి మధ్యలో నెక్కడో యొక చోట మూడవది యుండును. పై స్థానము రెండవ పటములో 'A' అనియు కిందిస్థానము 'B' అనియు గుర్తింపబడినవి. అచ్చట వివిధములైన మానసిక వృత్తులు (Vrittis) బీజములు సుడివడి యుండును. A, Bల మధ్య నొకస్థానము గలదు. కొంత రాజయోగాభ్యాసానంతరము, దానినొక్కినట్లయిన, ఉత్తమ లోకములందున్న విముక్తజీవులతో సంభాషించగలవు.




2వ పటము

ఎప్పుడైనా, ఏదైనా, నీ వాలోచించినప్పుడు, ఆ యాలోచన మొదటగా 'A'లో పుట్టును. 'A' వద్ద పునః పునః ఏది ఆలోచించినను దానికి తగినట్లుగానే నీ విధి మారును. 'B' వద్ద సమస్త విషయ వాంఛలు పోయినట్లు ధ్యానించిన ఫలితము చాలా తక్కువ కాలములో పొందగలవు. అది యనుభవము ద్వారా తెలియవలనేగాని దాని నూహించనైనా

ఊహించలేవు. సహజమార్గ పద్ధతిలోని అభ్యాసకులు ఈ స్థానములపై నభ్యాసము చేసి గమనార్హమైన యభివృద్ధిని సాధించుచున్నారు. ఈ రెండు స్థానములపై సాధనము క్రమపద్ధతిలో జరిగినచో, కోరికలు తొందరలో నశించును. A,B లు మధ్యనున్న ఒకస్థానము సరిగా నుపయోగింపబడనిచో నాశనము తటస్థించును గాన ఆ స్థానము రహస్యముగా నుంచబడినది. అందుచే నే నాస్థానమును బహిర్గతము చేయుటలేదు. 'U' అని గుర్తింపబడిన పై భాగము హృదయములో ప్రథమ భాగము. 'L' అని గుర్తింపబడిన క్రింది భాగము హృదయములో ద్వితీయ భాగము. పై భాగము గొప్ప ఋషులు చేరుస్థానము. ఎన్నో యజ్ఞయాగాదులు, ఎంతో తపస్సు చేసిన మీదట వారీ స్థితికి వత్తురు. దగ్గరలోనున్నను, నిజముగా అర్హత గలవానికి మాత్రమే తప్ప. ప్రతివ్యక్తికి ఈ స్థితి తెలియజేయబడదు. క్రిందిభాగము సాధారణముగా ప్రజాసామాన్య ముండు స్థానము. నిమ్నకోటి అధిచేతన (Super Consciousness of the inferior type) 'U' అని గుర్తింపబడిన స్థానములో నుండును. ఈ స్థానములో నున్నపుడు భగవద్విషయజ్ఞానము తెలిసికొనుటకు ప్రారంభించెదవు. ఈ నిమ్నకోటి అధిచేతననైననూ ప్రపంచ విషయోన్మత్తుడైన మానవుడు పొందలేడు. A, B స్థానములను శుభ్రపరచుకొనుచు పైభాగములో ప్రవేశించితివేని ఇంకొక రకమైన అధిచేతన స్థితిని పొందుట కర్హత సంపాదించుకొందువు. B అను స్థానమును పూర్తిగా శుభ్రపరచు కొన్నవాడు ఈ తరువాత చెప్పబోవు అధిచేతనాస్థితిలో ప్రవేశించు శుభవార్తను పొందగల్గును. A, B స్థానములను సరియైన కొలతలతో తెలుపుచున్నాను. శరీరమందలి ఎడమభాగమున అనగా ఎడమ ఊపిరితిత్తికి అడుగుభాగమునకు దగ్గరగా హృదయమున్నది. ఎడమచనుమొనకు తిన్నగా కుడివైపుగా రెండు వేళ్ళ దూరము కొలువుము. అక్కడ నుండి సరిగా క్రిందకు మూడు వేళ్ళ దూరము వరకు సాగుము. ఇది A అను స్థానము. A నుండి తిన్నగా కిందకు రెండు వేళ్ళ దూరము వెళ్ళుము. నీ కింది, ప్రక్కయెముకకు సరిగాపైన B అను స్థానమును కన్గొందువు. కొలతలు ఎవరివేళ్ళతో వారే తీసికొనవలయును. మన అధిచేతన ఉత్తమ తరగతికి చెందిన అధిచేతనస్థితిని చేరు వరకు ఈ ప్రాంతములో పయనించును. ఇది మూడవ పటములో చూపబడినది.


హృదయములో (1వ పటము) పై భాగము(U) కుడివైపు గలదు. ఇక్కడ (3వ పటము) అదే ఎడమవైపున గలదు. క్రిందిభాగము (L) కుడివైపుకు గలదు.

ఇక్కడ $A_1$, $B_1$ అను రెండు స్థానములు హృదయములోని A, B ల వంటివి గలవు. $D_1$ అను స్థానములో ఉత్తమ అధిచేతన (Super-consciouness) గలదు. $A_1$ వద్ద కలుగు భావములు (Aతో పోల్చినపుడు) ఉత్తమ తరగతికి చెందుట యన్నది మాత్రమే భేదము. ఉత్తమ స్థితులు పరిపాలింప ప్రారంభించుటకు $B_1$, స్థానమును పరిశుభ్రపరచుకొను బాధ్యత అభ్యాసికి




3వ పటము

వదలబడినది. హృదయములోని A, B స్థానములను ఎంతవరకు శుభ్రపరచు చుందువో అంతవరకు ఇచ్చటను శుభ్రపడుచుండును. సామాన్యముగా ప్రజలు అధోభాగమని పిలువబడు కుడి వైపునకు వెళ్ళెదరు. ఎందువల్ల ననగా అంతకంటే ఉత్తమస్థితిలో ప్రవేశింపగల్గునట్లుగా హృదయమును వారు పరిశుభ్రపరచుకొనలేదు. వారికిగల సమస్త వసనలతోను దీనిలో ప్రవేశించుటకు ప్రయత్నింతురు. ఎడమవైపునకు సాగు ప్రయత్నము చేయుచు అసాధ్యమును యత్నించుచున్నారు. అట్టి స్థితిలో శిష్యుని, వాని వాసనల నన్నింటిని వదలించి సరియైన త్రోవలో నడిపించుట. సమర్థుడైన గురువుపై నాధారపడి యున్నది. ఇచట హృదయ ప్రాంతములోని బృహత్ వృత్తములో భాగమైన విశ్వము (Cosmos) మొదలగు చున్నది. ఇచ్చట అభ్యాసకులు కాంతిని మిక్కిలి ప్రకాశవంతముగా ననుభవింతురు. కాని ఇది మన గమ్యస్థానము కాదు. ఈ పెద్ద హృదయవృత్తము దాటుటకు ముందు దానిని చీల్చుకొని పోవలెను.




4వ పటము

అట్లే యిప్పుడు మనము $D_2$ అను పిలువబడు పై స్థానమునకు వచ్చెదము. నాల్గవ పటములో చూపబడినట్లు కుడివైపు భాగము కింద స్థానము ఇచ్చట అధిచేతనయొక్క అతి సూక్ష్మస్థితి (Superfine state of Super-consciousness) చూడగలము. ఇది యంతయు హృదయమందలి 'B' అను స్థానముపై నాధారపడి యున్నది. అంతగర్భము వరకు దానిని పరిశుభ్రము చేసిన, నిన్ను $A_2$ అను స్థానము వద్ద నది దింపును. ఆ ఆస్థానము $D_2$ అను ప్రాంతములో కలదు. అధిచేతన యొక్క అత్యుత్తమస్థితికి కొలదికిందుగా (అనగా పుఱ్ఱెవెనుక) "మనో ప్రాంతము" ప్రారంభమగును. అచ్చట మరల రెండు భాగములు, అట్టి స్థానములనే కల్గియున్నవి. తరువాత నేను చూపబోవు పటములోని స్థానమును చేరుకొనుటకై, పై స్థానములు సులభముగా దాటబడును. సంక్షిప్తముగానైనను, హృదయప్రాంతమును గురించి తగినంతగానే నేను చర్చించితిని. అటనుండి మన పురోగతిలో నెదుర్కొను ఉత్తమ స్థితులను గురించి యికముందు చెప్పెదను.


# మనోప్రాంతము

హృదయప్రాంతమును దాటిన తరువాత ప్రథమ మనస్సు (First Mind or Super-Mind of God)లో ప్రవేశింతుము. అక్కడ పొందునను భావమును వర్ణించుటకు భాష చాలదు. ఈ బృహత్ ప్రాంతము సూచించు కొన్ని గుర్తులు మాత్రమే కలవు. హృదయప్రాంతములో మనము పొందునది ఊహాతీతమైనది. మనమిప్పుడంతకంటె గొప్పస్థితిని గురించి మాట్లాడుకొందము. హృదయప్రాంతము యొక్క సారమచ్చటనున్నది. ప్రస్తుత ప్రపంచము యొక్క స్వరూపము ఆ ప్రథమ మనస్సువలన నేర్పడినదే! అచ్చట నంతయు శక్తియే! కలయికగాని కాంతిగాని లేదు. హృదయ ప్రాంతపు అసలు స్వరూపములో ప్రశాంతత ప్రాముఖ్యమును వహించునని చెప్పితిమి. ఆ ప్రశాంతతయెట్టిదో ఎవరును ఊహించలేరు. కాని యేదోవిధముగా దానిని చెప్పవలెననిన, హృదయప్రాంతములో వ్యాపించు ప్రశాంతతను క్షాళనము చేసినచో మనోప్రాంతములో గల ప్రశాంత లక్షణమును చూచాయిగా తెల్పును. ప్రశాంతతయన్న భావము మాత్రమే అచ్చట యుండును. మరొకవిధముగా చెప్పవలెనన్న ప్రశాంతమునే మరపించు స్థితి (Forgetful State of Calmness) యచ్చట బలీయముగా నుండును. కాని అది మాత్రమే కాదు మనము పొందవలసినది. మన మీ ప్రాంతములో ప్రవేశించినపుడు మన అనుభవశక్తి యెక్కువగా అభివృద్ధి పొందును. ఇప్పుడెవరికి వారనుభవించుటయే మిగిలి యుండును. అక్కడ నుండి సాకారము. ప్రకారము బహిర్గతమగును. అక్కడ చైతన్యము కలదు. అదృశ్య చలనము (క్షోభ) సృష్టి సంకల్పముతో కలిసినపుడు ఆ శక్తి అధోముఖముగా విజృంభించును. దాని ఫలితమే మన మీ ప్రపంచములో కన్గొను అసంఖ్యాకములైన వైవిధ్యములు. అచట వాయువు వీచదు. ఇది భగవంతుని మిక్కిలి శక్తివంతమైన ప్రాంతము. నీ కర్థము కావలెనన్న భగవంతుని యంత్రాగారము పనిచేయునట్లు చేయు ఒకానొక శక్తి నిలయము (Power house) అని పిలువవచ్చును. చలన రహితవస్తువులు (అదృశ్య చలనముగా కన్పించును) ఎక్కువ శక్తివంతములై కంపనలను ప్రోత్సహించుచు అచ్చట ఉండును. ఈ విషయ మనుభవించవలసినదే కాని వివరించి చెప్పుట చాల కష్టము. ఎంత తెలియని దైవము, చైతన్యమచ్చట నున్నదన్నపుడు ప్రశాంతత యెట్లుండగలదని ప్రజలు సందేహించవచ్చును. అచ్చటి ప్రశాంతత క్షాళన పరచినదై యుండునని అది తెలియనిదని సృష్టిని గురించిన యభిప్రాయము ఏ విధముగా నూహాతీతమో, అట్టిదిగానే చెప్పుచున్నాను. అయినను నిది కొంతవరకుపయోగపడును. శూన్యత్వమని చెప్పబడిన ప్రదేశమునకు మనమింకను చేరలేదు. మన మీ స్థితికినెప్పుడు చేరగలము? మన మచ్చటి స్థితితో

సమానముగా మారగల్లినప్పుడే అది సాధ్యము. ఈ శూన్యస్థితిని చేరుటకు ప్రథమమనసుస నుండి మనము శక్తిని పొందుదుము. దేవదూతలు కూడ ఈ స్థితి కొరకు తపించెదరు. ఈ స్థితి, స్థితులన్నింటిని అధిగమించిన జీవన్ముక్తులకు మాత్రమే సాధ్యము. దివ్య ప్రకాశము కూడ నింక కొంద్దిగా మిగిలియున్నను ఇప్పుడది దృశ్యమగును. కాని ఎక్కడ? కొద్దిదూరము పోయిన తరువాత మాత్రమే అది కూడ మాయమగును. అనగా నీవు పొందదగు స్థానమును ప్రవేశించుటకు ఏర్పాట్లు చేసికొనుచున్నావన్నమాట. దివ్యప్రకాశము యొక్క పరిమితి కొలది మార్గము వరకే వ్యాపించి యుండును. ఆ తరువాత కేవలము ఊహయే మిగిలియుండును. ముందునకు సాగుము. అదికూడ పోవును. ఇచ్చట భాషకు తావులేదు. మనోప్రాంతము దాటబడినది.

# కేంద్ర ప్రాంతము

మనో ప్రాంతము దాటగనే కేంద్ర ప్రాంతము వచ్చును. సూక్ష్మమైన అధిచేతన యీ ప్రాంతములో వచ్చును. సహజమార్గమునకు సంబంధించిన దశాదేశ వ్యాఖ్యానము (The Commentary on Ten Commandments)నందు చెప్పబడినట్లుగా, వివర్త సిద్ధాంతము (Theory of Invertendo) మరల వచ్చును. హృదయము యొక్క కుడిభాగములో నే పద్ధతి యున్నదో, యీ ప్రాంతములో కూడ కుడిభాగమున అదేపద్ధతి యున్నట్లు తెలిసికొందుము. $D_3$ అన్నది అధిచేతనకు చివరిదశ. అక్కడ నన్నిదశలును నంతమై శూన్యత్వము మిగులును. అది అధిచేతనకు నత్యుత్తమ స్థితి.




5వ పటము

ఈ విధమైన అధిచేతన దేవతావతారములకు నిల్వ చేయబడినది. కొన్ని సమయములందిట్టి స్థితి ఒకానొక ప్రత్యేక (special personality) వ్యక్తికి కూడ కలుగ జేయబడును. కాని యిట్టిది చాల నరుదుగా ప్రత్యేక పరిస్థితులలో ప్రపంచమును మార్చుటకై వచ్చిన వ్యక్తులకు మాత్రమే చెల్లును. అతనిస్థితి దేవతావతారముల తరువాతిది యగును. ప్రకృతి మార్పుకై చేయునతని విధి నిర్వహణలో సాక్షాత్తు అవతార పురుషుని స్థితినే అనుభవించును.

ప్రకృతిలో మార్పు యిప్పుడు అవసరమై యున్నది. పూర్తిగా "మరమ్మత్తు" చేయబడవలెను. దీనికొక ప్రత్యేక వ్యక్తి యుద్భవించినాడని నమ్ముడు. అతడు రెండున్నర (*ఈ రెండున్నర సం॥ల కారలము ఈ పుస్తకము వ్రాయబడిన తేదీ నుండి లెక్కింపబడినది. ప్రథమ ఆంగ్ల ప్రచురణము నుండి సుమారు 6 సంవత్సరములయినది. ఆ విధముగా 1944వ సంవత్సరాంతమునకు వచ్చును. అప్పటినుండి ప్రపంచములో మార్పు తెచ్చుటకతడు కృషి చేయుచున్నాడు.*) సంవత్సరముల నుండి తని కృషి ప్రారంభించి చేయుచున్నాడు. అతని సూచనలననుసరించి, ప్రపంచ ప్రజానీకముచే సామాన్యముగా నెరుగబడక, ఆధ్యాత్మిక రంగములో ఉత్తమస్థితిని సాధించిన యీ నాటి గొప్ప ఋషులు, పనిచేయుచున్నారు. ఇంకను ఎక్కువమంది వ్యక్తులు ముందుగల పని నెరవేర్పబడుటకై తయారు కాబడుచున్నారు. కన్నులుండి చూడగల్గినచో అతని కృషి, దాని ప్రభావము చూచి తెలిసికొనవచ్చును. ముందు చేయవలసిన పని చాల ముఖ్యమైనది. మార్పు తెచ్చుటయే "ఆఖరి" ఫలితము. కొంతకాలము పట్టవచ్చును. కాని ఫలితము తప్పదు. తరువాత ప్రపంచము తన

స్వస్వరూపముతో ప్రకాశించును. దానికై యతడు రంగమును సిద్ధపరచుకొన్న తరువాత నతని యాజ్ఞలననుసరించి, వివిధ ప్రకృతి శక్తులు అతని సలహాలతో పనిచేయుటకు ప్రారంభించు సమయము సమీపములోనే ఉన్నది. ఆ ప్రకృతి శక్తులు పనిచేయుట కెదురు చూచుచున్నవి. ప్రకృతి యంత్రాంగము సరిగా పనిచేయు స్థితిలో నుండుటకు అట్టి వ్యక్తి సూటిగా శక్తిని పొందును. ముక్తజీవులతో సంభాషించగల శక్తిసామర్థ్యములు కల్గి నిజమైన ఉన్నతస్థితిలో నున్న దివ్యదృష్టి గల్గి, బాగుగ నభివృద్ధి పొందిన ఋషులు, సూటిగా వానితో సంభాషించి గాని, ప్రకృతిని చూచిగాని, యీ విషయములను రూఢిపరచుకొనవచ్చును. మిగిలినవారు కాలక్రమముగా ఫలితములను స్థూలముగానే తిలకించగలరు.

మరల మన విషయములోనికి వత్తుము. ఇప్పుడిప్పుడు మన కర్తవ్యములన్నియు నంత మొందును. పవిత్ర రూపములో మనమిప్పుడు దైవస్థానములో ప్రవేశించితిమి. మన గమ్యస్థానము చేరుకొంటిమి. దానిలోనికి మనకు ప్రవేశము లభ్యమైనది. ఆత్మ సాక్షాత్కారమైనది. మనోప్రాంతములో నిబిడీకృతమైన జ్ఞానశక్తిని (Actual consciousness), హృదయ ప్రాంతములో వ్యాపించిన చేతనత్వమును అధిగమించితిమి. అంతులేని పునర్జన్మ చక్రమునుండి ఇపుడు బయటపడితిమి.

ప్రజలు దీనిని ''సత్యస్థితి'' (Truth)యని పిలువవచ్చును. మనము చేరిన స్థితి నిజముగా ''సత్యస్థితి'' కాదు. సత్యస్థితి వెనుక విడిచిపెట్టబడినది. ఇంక మనమెంత మాత్రము అందులో నివసించుటలేదు. సత్యమన్న మాటలో నేదో యొకటి లేనిది యున్నట్లు భాసించుచున్నది. అక్కడ నేమియు లేదు. నిజానికి శూన్యత్వముగా వర్ణింపబడిన స్థితినుండి తీసివేయబడిన పిప్పి వంటిది ఈ సత్యము. ఇంకను స్పష్టముగా చెప్పవలెనన్న చేతనరూపములో (Consciousness) కన్పించు ''సత్యస్థితి''ని ప్రజలు సామాన్యముగా మెచ్చుకొందురు. జ్ఞానస్థితి (చిత్) మన గమ్యస్థానము కాదు. పిల్లలు ఆడుకొను ఆట వస్తువు మాత్రమే అది. చేతనత్వము ఉండవలసిన నిజస్వరూపములో నెచ్చట నుండునో, అచ్చటకు మనము చేరవలెను. మందులు తయారుచేయబడు మూలరసము (Mother Tincture)నకై మనము వెదకవలెను. జ్ఞానమును (చిత్) సృష్టి చేయు సమర్థత (Potentiality) కొరకై మనము వెదకుచున్నాము. దీనిని కూడ దాటిన నిజమైన, పవిత్రమైన, సూక్ష్మమైన భగవంతుని పంచనుందుము. ఈ తత్వము సమగ్రముగా, భాషచే వర్ణింపబడలేనంత, ఉన్నత స్థితిలో నున్నది.

సమర్థత్వము (Potentiality) మనము వెదకవలెనన్న, మీకర్థమైనదా? దానికి మూలమేది? ఎచ్చటనుండి వచ్చును ? నిజమైన యోగికి విశ్రాంతి స్థలమైన ''తమ్'' స్థానము నుండి వచ్చును. తమ్ అనగా సత్వరజస్తమో గుణములలో నొకటి గాదు. సహజమార్గము యొక్క 'దశాదేశ

వ్యాఖ్యానము'లో చెప్పబడిన స్థితిని తెలియజేయునట్టిది మాత్రమే! వారి స్థితి గతులను బట్టి ముక్తజీవులు. ఇప్పుడు వర్ణింపబడిన "తమ్‌స్థితి" పొందుదురు. ముక్తజీవులు జ్ఞానస్థితిని గాక (ACTUAL CONSCIOUSNESS) దానిని పొందగల శక్తిని మాత్రమే కలిగి యుందురని కొంతమంది తత్వవేత్తలు వెలిబుచ్చు నభిప్రాయము సరికాక పోవుటయే గాక పెడత్రోవకూడ పట్టించును. ముక్తజీవులు జ్ఞానము (చిత్) మరియు శక్తి (Potentiality) రెంటిని వారి యిష్టప్రకారముపయోగింప వీలుగా నభివృద్ధి చేసికొందురనుటలో సందేహము లేదు. కాని వారా రెంటికి పై స్థానములో నుందురు. అప్పుడు మాత్రమే ముక్తి లభించును. నీలో నభివృద్ధి పొందిన శక్తి (Potentiality) యున్న యెడల, శూన్యత్వము భావము నుండి సుదూరముగా నున్నట్టి దేదియో పొందితి వని యర్థము.

తత్వవేత్తలు సామాన్యముగా ఇతరులను తమ ఆలోచనల వైపునకే లాగుకొందురు. కాని అది సరియైన మార్గము కాదని నా కనిపించును. నిజానికి ప్రత్యక్ష స్వానుభవము మాత్రమే తన్నుతాను తెలిసికొనుటకు సహాయపడును. ఇతర మార్గముకాని, పద్ధతిగాని, గ్రంథము గాని, వేదముగాని, యీ విషయములో నుపయోగపడదు. శూన్యత్వముతో నొకటి యగుట గాని ఏకత్వము అను దానిని, సత్య స్వరూపము తెలిసికొనుటగా చెప్పినచో, సత్యమునకు, దానికి నెంత దూరమో కదా! 'సత్యము'నకు దాని నిర్వచనమే కలదు. కాని తుదకు మనము చేరవలసినది సమస్తమునకు ఆవలది మాత్రమే !

కేంద్రస్థానము కనిపెట్టబడక పూర్వము దాదాపు ప్రతివ్యక్తిలోను 'సత్యము' ప్రాముఖ్యము వహించియున్నది. మానవాభివృద్ధి సోపానములలోను, సర్వేసర్వత్ర సత్యమున్నది. ఆధ్యాత్మిక శాస్త్రములో సామాన్యముగా, వస్తుతత్వ నిజస్వరూపము తెల్పుటకు ఈ పద ముపయోగించెదరు. పదార్థము నుండి వేరైన ప్రతిదియు సత్యమనియే పిలువబడును. అనగా పదార్థము అంతమొందగా నేది మిగులునో అది సత్యమని పిలువబడును. కాని యీ రెండును అంతమైన స్థితిని ఏమని పిలుతువు? దానిని సత్యమని పిలువగలవా? లేదు. ఎందువల్లననగా ఎక్కడ పదార్థముగాని స్థూలత్వముగాని అంతమగునో అక్కడ చైతన్యము వచ్చును. ఇంక ముందుకుసాగి, ఆ రెంటినిదాటిన ఇవి ఏ స్థానమునుండి వచ్చినవో ఆ స్థానమును చేరుదువు. వానిని దాటనంతవరకు సత్యముయొక్క పరిధిలోనే ఉంటివన్నమాట. దానిని దాటగనే అదియుపోయి, నిశ్చైతన్యత్వమో, లేక శూన్యత్వమో మిగిలియుండును.

ప్రజలు అహంకారము వెంటబడుచున్నారు. వారు దానికి బలియగుదురు. అది స్థూల శరీరాకారముగా గాని లేక దానికంటె అంత్యస్వరూపములో గాని ప్రత్యక్ష మగుచున్నది. భగవంతుని తెలిసికొనుటలో నిదియొక ఆటంకము. అది హృదయ ప్రాంతములో ప్రారంభమగును. ఈ

ప్రాంతము దాటగానే దాని స్థౌల్యబలము తగ్గును. మరొక విధముగా చెప్పవలెనన్న, హృదయ ప్రాంతము దాటినవారికి కర్తృత్వభావము నీది "మమ"కారము తగ్గిపోవును. అప్పుడు మనోప్రాంతములో వారు ప్రవేశింతురు. ఈ ప్రాంతములోని అహంకారము చాలా సున్నితమైనది. పరిశుభ్రము చేయబడిన అహంకార స్వరూపమే కాని దోష మెప్పటికిని దోషమే. దాని నివాసమైన మనోప్రాంతములోనికి వచ్చినప్పుడు దాని శక్తి పెరుగును. ఎందువల్లననగా దానితో వెళ్ళి, కంపనముల రూపములోనున్న చైతన్యము నుండి, శక్తిని బొందుదువు. ఇప్పుడు నీ గమ్యస్థానము ఉండవలసిన రీతిగా నున్నచో, దానిని పొందగల దీక్ష దృఢమై స్వచ్ఛముగా నున్నచో కేంద్ర ప్రాంతము నుండి శక్తిని పొందుట ప్రారంభింతువు. ఆ ప్రాంతము ముందుకు పోదగిన మార్పు చేయును. కేంద్ర ప్రాంతములోనికి చొచ్చుకొని పోయినచో నది యైక్యమైనట్లు తోచును. ఆ స్థానములో నీ శరీరమును విడుచువరకు నది ప్రాబల్యము వహించియుండును. అక్కడ భావము యుండదు. ఒక విధముగా నీవు నగ్నముగా నుందువు. అందుచే నహంకారము కూడ నగ్నముగనే కన్పట్టును. అది తుదకు ముక్తజీవుల విశిష్టతయగును. అప్పుడది దాదాపు నశించినదనియే చెప్పవచ్చును.

వివిధ రంగములలోని అహంకార స్థితుల నిర్ణయించుట ప్రజలకు తెలియజేయుటకై యీ విషయమింకను కొంత చెప్పుట అప్రస్తుతము కాదని తలంతును. అహంకారమను భావము శరీరమునుండి పుట్టును. దీని ప్రభావముతో నీవే పని చేసినను స్థూలస్వభావము కలిగి, నీవే (శరీరమే) చేయు చుంటివని తలంతువు. ఇది అహంకారము యొక్క అధమ లేక అనాగరిక దశ. ఈ దశలోని మనుష్యుని దృష్టి శరీరముపై నుండును. చూచునది చేయునది శరీరముగనే భావించి దానిని అధిగమించి దూరము పోలేడు. భౌతిక శరీరము తప్ప ఈ యితరాభిప్రాయము నతని కుండదు. ఇది ప్రపంచములోని సామాన్య మానవుల స్థితి.

ముందుకు పోయిన కొలది, లోకవ్యవహారముల నడపునది నీ శరీముకంటె నవ్యవస్తువేదియో నీలో కలదని తెలిసికొనగలవు. ఇది అహంకారము యొక్క రెండవస్థితి. ఇక్కడ వ్యక్తి దృష్టి భౌతిక శరీరము నుండి అంతర్గతముగా మరలును. వివిధ మనుష్యులు వారివారి ఆలోచనలు విశ్వాసములను బట్టి వివిధములుగ భావింతురు. కొంతమంది ఆత్మయే అన్ని పనులు చేయుచున్నట్లును, శరీరము కార్మికుని చేతులలో పనిముట్టువలె మాత్రమే ఉన్నట్లు భావించెదరు. కార్మికుడే నిజముగా పనిచేయువాడు. పనిముట్లు అతని సహాయము కొరకు మాత్రమే ! అట్లే ఆత్మయే నిజముగా పనిచేయుచున్నది, శరీరము కాదు. కొంతమంది వారి కాదర్శమైన మనస్సో, దైవమో గురువో, నిజముగా పనిచేయించు వారిని తలంతురు. ఇక్కడ భౌతిక శరీరము పని చేయుచున్నదన్న యభిప్రాయమే మరువబడును. ఇంకను ముందునకు పొమ్ము! ఏ పనిచేసినను, శరీరముచేత గాని, లేక పైన సంగ్రహింపబడినట్లు, శరీరమందలి మరియే యితరముచేత గాని


చేయబడనట్లుగా తెలిసికొందువు. ఇప్పుడు సరియైన మార్గమునకు వచ్చి, పనిచేయు కర్తను గురించి ఆలోచింపక పని తనంతట నదే జరుగుచున్నట్లు తెలిసికొందువు. కర్త శరీరము గాదు. మనస్సును గాదు. లేక మరియే యితరమును కాదు. ఏదో మార్గమున పని దానంతటనదే జరుగుచున్నది. ఈ స్థితిలో నెట్లు జరుగుచున్నది? ఎవరివలన? దేనిగుండా? అను ప్రశ్నలు మనస్సులో మెదలవు.

ఇంకను ముందుకు పోయిన పనిచేయుబడుచున్నదన్న భావము వుండదు. ఒక పనిచేయుటకు ముందుగాని, తరువాతగాని యేమి జరుగునది తెలియక, ప్రకృతి అవసరము ననుసరించి ఏది యెప్పుడెట్లు జరుగవలెనో అది జరుగుచుండునని మాత్రమే తెలిసికొందువు. ఈ విషయము ఈ క్రింది యుదాహరణమువలన చక్కగా నర్థమగును. ఒక మనుష్యుడు నిద్రించుచున్నాడు. నిద్రలో నతనిని దోమలు, చీమలు కుట్టును. లేక శరీరముపై కండూతి కల్గును. వెంటనే అతిన హస్తమచ్చటికి పోయి అవసరానుగుణముగ పని నెరవేర్చును. అతడు మాత్రము నిద్రావస్తలోనే ఉండును. ఇప్పుడుతనికి ముందుగాని అప్పుడుగాని తరువాతగాని జరిగిన విషయము గుర్తుండదు. మేల్కొనిన తరువాత దాని గురించి యేమియు జ్ఞాపకముకూడ నుండదు. ఈ మేల్కొనియు నిద్రించువాని స్థితిని పొందునపుడు దానిని కొనసాగించి, అవసరానుగుణముగ పనిచేయుము. పనిని గురించిగాని దాని కర్తను గురించి గాని ఆలోచింపకుము. అప్పుడా పనులయొక్క ముద్రలు నీపై నుండవు. మరియు కొలది దూరములో అది యొక గుర్తుగా మారును.

ఈ అహంకారముయొక్క వివిధావస్థలు కేంద్ర ప్రాంతములో ప్రవేశించునపుడు దాదాపు నశించును. నేను చెప్పిన విశిష్టమో, ముక్తజీవుల విశిష్టమో, ఇంకను కూడ మిగిలియే యుండును. సర్వము నశించు మహాప్రళయమున మాత్రమే అది అదృశ్యమగును. అప్పటికిని శూన్యమని పిలువబడునట్టిది మిగులును. ముక్తజీవుల గుర్తులుగాని, మిగిలిన చరాచర ప్రపంచపు గుర్తుగాని లేక సమస్తము ఏకీభవించి, వ్యక్తిత్వ విశిష్టములు బాయును. ఇదియు ఒక విశిష్టతగా నిలబడి సమయము రాగానే మరల క్రొత్తగా సృష్టి కార్యక్రమము సాగించును.

అచ్చటికి చేరినవారు వారికీయబడిన సూచనల ననుసరించి ప్రకృతిని క్రమపరచుచుందురు. సూచనలు “ఆదిమూలము”ని (Absolute Base) యొద్దనుండి వచ్చును. ఆ ఆదిమూలము నుండి సూచనలు ఎట్లువచ్చునది నేను తెల్పగలను. అట్టి అనుభవమును పొందువరకు దానిని అపార్థము చేసుకొనుట కవకాశమున్నది కావున నేను దానిని చెప్పుటలేదు. ప్రత్యేక శక్తులతని కొసగబడును. వానిలో నతడు పనిచేయ ప్రారంభించును. భగవత్సృష్టి యొక్క స్పర్శ యతనికి తగిలి అతనిని తదనుగుణముగా మలచును. భగవంతుని ప్రతి ఆజ్ఞయు నతనిగుండా పోవును.

ప్రకృతిలో ప్రతి విషయమును గ్రహించి, తెలుసుకొనగలడు. విషయము స్పష్టముగా నతని కంటికగుపించును. ఏకత్వము ప్రాముఖ్యము వహించును. బహిరంతరముల సర్వత్ర దానినే అనుభవించును. ఒక రాతిని, మనుష్యుని, లేక ఒక మొక్కను అవి యున్న స్థూలరూపములలో నిర్ణయింపడు. పరిమితులిచ్చట నంతమొందును. ఇది తుది గమ్యస్థానము. జీవిత సమస్య పూర్తిగా పరిష్కరింప బడినది. పూజలు ధ్యానము ఇచ్చట అవసరము లేదు. ప్రకృతికి సంబంధించిన వివిధ శక్తులతని యాజ్ఞకు లోబడియుండును. వానితో నతడు పనిచేయుచును. ఆ శక్తులతనికి విధేయముగ నుండును. అట్టి వ్యక్తి విశ్వమంతటిలో ఒకేకాలములో నొక్కడు మాత్రమే యుండును. మహాప్రళయ సమయము వచ్చినపుడు, ఆ సమయములో నున్న అట్టి వ్యక్తి సృష్టిని లయముచేయుటకై ప్రత్యేకముగా నియమింపబడిన ముక్తజీవితో కలసి పనిచేయును. పైన చెప్పిన ముక్తజీవుడు మిగిలిన వారికంటె కేంద్రమునకు చాల దగ్గర నున్నవాడై యుండును. ముక్తజీవులు చేరు స్థలము 6వ పటములో చూపబడినది. కేంద్రప్రాంతములో వారీదులాడుదురు - అది అపరిమిత విశాల వ్యాపితము - అనంతము. పైన చెప్పిన మృత్యు రూపములో మహాప్రళయము వచ్చు సమయమున మాత్రమే ముక్తజీవులు విశిష్టత్వముల కోల్పోవుదురు.




6వ పటము

కేంద్రమగు 'C' అను గుర్తునకు చుట్టును గల ప్రదేశము ముక్తజీవులు చేరి యీదులాడు సరియైన స్థలము. ఇది యెంత విశాలమైనదంటే ఆది కాలమున ప్రపంచోద్భవ సమయమున మొట్టమొదటి ఋషి అందీదులాడుచు, నిప్పటికిని దానిమధ్య భాగమును చేరుకొనలేదు. నేను చెప్పిన యీ విషయమును ఉత్తమ దివ్యదృష్టి గలవారు, అనగా కేంద్ర ప్రాంతములో ప్రవేశించిన వారి కుండదగు స్థితి కలవారు సరిచూచు కొనవచ్చును.

ఈ ప్రాంతములో శూన్యత్వమని చెప్పబడిన స్థితి ఒకానొక విధముగా శక్తి రహితమను భావము కలుగజేయును. దగ్గరలో అదృశ్యచలనములు నున్నప్పటికీ, కేంద్రములో మాత్రము నెట్టి చైతన్యము నుండదు. నిశ్చలతను, మూకీభావమును అది స్ఫురింపజేయును. దానినింకను వివరించిన ప్రజలు కంగారు పడెదరు. దానిలో అది అనంతమే. ఎవరేని ఏ మాత్రము ముందుకు పోయినను విస్మయాశ్చర్య సాగరములో మున్గిపోవుదురు. అత్యుత్తమానుభవమునకు మాత్రమే అది సంబంధించినది. ఇచ్చటి స్థితి ఊహలకు, వర్ణనలకు అతీతము. ఎవరేని ఉన్నతస్థానము లలంకరించి యిట్టి సేవచేయుటకు అవకాశమిచ్చిన, నేను చాల సంతోషింతును. ఇప్పుడు భగవంతుడు సర్వశక్తిమంతుడని సామాన్యముగా వర్ణింపబడినాడు. అతనిని సర్వశక్తిమంతుడని

ఎందువల్ల పిలుతుమనగా, మనలోగల శక్తి ఆ మహాశక్తిలో నొకభాగమని మనము తలంతుము. మనలో కన్పించుశక్తి, ఆ మహాశక్తి పని చేయుటవల్ల నేర్పడినదియే! విద్యుత్తు "డైనమో" ఉదాహరణమును పరిశీలించిన యీ విషయము బాగుగా నర్థమగును. ఇది ఒక ప్రత్యేపద్ధతిలో సూదంటు రాళ్ళమర్చబడిన ఒక యంత్రము. ఇప్పడీ "డైనమో"లో స్వశక్తి ఎంతమాత్రము లేదు. కాని అది తిరిగినప్పుడు, ఒక విధమగు విద్యుద్రంగము సృష్టింపబడును. ఆ రంగమునుండి శక్తి వేగముగనుద్భవించును. ఆ రంగమున అక్కడక్కడ బంధింపబడిన చివరి భాగములు (Terminals) ఆ శక్తిని గ్రహించును. ఆ చివరభ్యాగములకు, "డైనమో" సూదంటురాళ్లకు నెట్టి సంబంధస్వర్శలు లేకున్నను, వానినుండి విద్యుత్తు ప్రవహింపనారంభించును. అట్లే కేంద్రము దగ్గర ప్రాంతముఉలో గల అదృశ్య చలనములు ఒక విధమగు శక్తిరంగమును సృష్టించును. దానిని నీవు కేంద్ర ప్రాంతమని పిలువవచ్చును. కాని యదిమాత్రము నిశ్శబ్ద నిశ్చలముగా నుండును. కేంద్రప్రాంతము నుండి సరియైన వాహకముల ద్వారా వివిధ ప్రకృతి శక్తుల ఆకారములలో మాత్రమే అది బహిర్గతమగును.

శూన్యత్వ స్థితియన్న నీ కర్థమైనదా? ఇది గొప్ప తత్వము. నేను వివరించుచున్నాను. ప్రజలు దీనిని మొదటలో గ్రహింపవచ్చును లేక గ్రహింపలేక పోవచ్చును. కాని కాలక్రమేణా అది యట్టిదని వారు తప్పక తెలిసికొందురు. వారు భగవచ్చేష్టలు చిత్రవిచిత్రములగా నుండునని చెప్పుదురు. ఎందువల్లననగా తెరవెనుక రహస్యము వారికి తెలియకుండ దాచబడినది. అసలు దైవముయొక్క స్వరూపము, కేంద్రము దగ్గరచేరి ఆ కెరటములలో నీదులాడుచున్న వారికి మాత్రమే కన్పించును. ఇది నా ప్రకృతి పరిశీలనమనియు, యదార్థానుభవ మనియు నమ్ముడు. నా శరీరమందలి ప్రత్యణువుపై నా గురువర్యులు కురిపించు ఆశీర్వచన ఫలితములవల్లను, రాజయోగము పూర్తిగా నభ్యసించుటవల్లను ఈ స్థితి నాకు కల్గినది.

వృత్తాకరాములో నంతమగుచున్న ఈ కేంద్ర ప్రాంతమున కంతకును కేంద్రమునుండియే ప్రకాశము వచ్చుచున్నదని చెప్పిన ప్రజలాశ్చర్యపడ వచ్చును. దానిని ప్రకాశమని చెప్పుటయు సరికాదు. ప్రకాశమన్నది దాని కంటె మిక్కిలి బరువైనదై, వెనుకదూరముగా వదలివేయబడిన విషయము. కాని అర్థమగుటకు (వేరుమార్గము లేదుగాన) మాత్రమే అది ప్రకాశమని చెప్పబడినది. కేంద్రప్రాంతములో నున్నదంతయు సహజమై, పవిత్రమైనదై యున్నది. దానిలో నేమియును అన్యపదార్థము కలియలేదు. ఇప్పుడు దీనిలో ప్రవేశించుటకు, పైన వృత్తాకరముగా చెప్పబడిన దానిని దాటవలయును. దానిలో ప్రవేశించుమార్గము సుగమము కావలయునన్న అది గురుశక్తి మూలముననే జరుగును. అక్కడ (అనగా కేంద్రప్రాంతము) అర్థమగుటకు మాత్రమే ప్రకాశమని పిలువబడిన శక్తివంతమైనది అంతమగును. అక్కడ చేరుటకు చివర బలవన్నిరోధక మొకటి

గలదు. దానిని దాటింపగల సమర్థుడైన గురువుచేత మనోప్రాంతము నుండి, ప్రేరేపింపబడిన శక్తి బలము వల్ల మాత్రమే అది దాటుట సాధ్యమగును.

6వ పటములో 'C' అని గుర్తింపబడిన ప్రదేశము కేంద్రము. దానిని భగవవంతుడనియో! మరేమనియో నీయభీష్టము ప్రకారము పిలువుము. అది ముఖ్యమైన స్థానము. ఈ స్థానము పూర్తిగా నిశ్చలమైనది. అచ్చట శక్తియు నుండదు. మరి యట్టి దేదియు నుండదు. దాని సమీపముగ అంతర్గతమైయున్న చలనము వలన శక్తి ఉద్భవించి ముందునకు సాగును. కేంద్రములో అదృశ్యచలనము (Latent motion) మాత్రమే ఉండును. ఈ స్థలవర్ణము, నిర్వర్ణము యొక్క అసమగ్ర ప్రతిబింబ (Faint reflection of colourlessness)మని చెప్పవచ్చును. అది కేంద్ర ప్రాంతమున కంతటికిని, ప్రకాశమని పైన చెప్పబడిన నీడ వంటి యాకారమును ప్రసరింప జేయుచున్నది. ఆ ప్రాంతమందలి నీడవంటి యాకారము దీనివల్ల కల్గుచున్నది. ముక్తజీవుల ఈదులాడు ప్రాంతమిది. అక్కడకు మన జీవిత కాలములోనే, సశరీరముగనే చేరి, ముక్త జీవులవలె నీదులాడ వచ్చును. ఇది నా గురువుగారైన, ఉత్తరప్రదేశ్‌లోని ఫతేఘర్‌కు చెందిన సమర్థగురు శ్రీ మహాత్మారామచంద్రజీ గారు కనిపెట్టిన అత్యద్భుత విషయము. దీనిని అభ్యాసము చేయుటకు, దానిలో ప్రవేశించుటకు వారు వీలు కల్పించిరి. ఆధ్యాత్మిక చరిత్రలో నింతవరకూ అంతర్దృష్టి ప్రసరించినంత మేరలో నిట్టి విషయము ఎప్పుడును కనిపెట్ట బడలేదు. ఈ స్థితిని మన మభివృద్ధి పరచగల్గినచో, ఈ శరీరము విడిచిపెట్టక పూర్వమే, అచ్చట ప్రవేశింతుము. శరీరము విడిచిన యనంతరమును, అచ్చట నీదుట కొనసాగుచునే ఉండును. ఆ సమయములో పూర్తి శూన్యత్వములో (Utter Nothingness) నీదులాడు చుందుము.

అదృశ్యచలనము శక్తినుత్పాదనము చేయగా అది బహిర్గతమై ఒక పదార్థమును సృష్టించును. అది యర్థమగుటకై చేపగుడ్లవలె నుండునని చెప్పవచ్చును. అదృశ్యచలనము ఉత్పత్తిచేసిన సమీకృత శక్తిసంపత్తి ఆ గ్రుడ్లవంటి వానిలో నుండును. ఇప్పుడు ఈ మూడును - (కేంద్రము, అంతర్గత చైతన్యము - గ్రుడ్ల వంటివి) ఒకదాని కొకటి విడిగా గుర్తింపలేనంత సన్నిహిత సంబంధము కల్గియున్నవి. ఈ మూడును పై కొకటిగానే కన్పించును. ఈ స్థలవర్ణము సంధ్యాసమయమందలి బూడిదవర్ణము కల్గియుండును. సరిగా చెప్పవలెనన్న ఆ రంగుయొక్క అసమగ్ర ప్రతిబింబమని చెప్పవచ్చును. అంతకంటె దృశ్యమానమైన సంధ్యాసమయమందలి బూడిదవర్ణ మేర్పడుటలో గల సారమేదికలదో దాని వర్ణమని చెప్పిన మిక్కిలి తగియుండును.

ప్రస్తుత విషయమునకు వత్తును. ఒక్కొక్క కణము (చిన్న గ్రుడ్డువంటిదని చెప్పబడినది) ఒక్కొక్క ప్రపంచమునకు యజమాని, అది దాని యునికికి కారణమై దానిని వశమందుంచుకొనును.

కేంద్రముచుట్టు నెన్ని కణములు (Cells) (గ్రుడ్లువంటివి) కలవో అన్ని ప్రపంచములు గలవు. ఆ కణశక్తిని ఛేదించి, దానిని ఒక యోగి యుపయోగించినచో ప్రజలు అణ్వస్త్రము (Atom bomb) మాట మరచిపోవుదురు. నాశనము కలుగజేయుటకు అట్టి శక్తి విభేదనము గావించి దానినెప్పుడైన నుపయోగించగల సామర్థ్యము ఒక్క అర్జుననకు ఉండెడిది. కాని ఆనాటి యుద్ధధర్మముల ననుసరించి ఉపసంహారములేని ఆయుధము నుపయోగించకూడదు. అందుచే అర్జునుడు దాని నుపయోగించలేదు. కురుక్షేత్ర సంగ్రామము సంభవింపనున్న సమయములో సమాలోచనము చేయు సమయమున భీష్మపితామహుడు ఈ విషయము దుర్యోధనునకు తెలిపెను.

అందుచే ప్రస్తుత కాలములో అణుశక్తిని భేదించుట యన్నది యింతకుముందు ప్రపంచమునకు పూర్తిగా తెలియని క్రొత్త విషయము కాదు. ఇంతకంటె పూర్వకాలమునకు సంబంధించిన విషయము నాకు తెలిసినది. రామాయణ కాలములో (రావణాసురుని కోట దహించుటకు) లంకాదహనమునకు సింహళ ప్రాంతమందలి సముద్రజలమున కన్గొన్న ఒకానొక వాయుశక్తిని హనుమంతుడు తన చిత్త శక్తి ప్రభావమున నుపయోగించెను. అది యింకను నక్కడ నున్నదో లేదో నవయుగ శాస్త్రజ్ఞులు ప్రయత్నించి చూడగలరు. పాశ్చాత్యులు మహాయంత్ర సహాయము వల్ల చేయుపనిని హనుమంతుడు తన చిత్ శక్తిచేతనే యొనర్చెను.

ఇప్పుడు ప్రజలు కేంద్రము వద్దయున్న కణములలో కన్పించుశక్తి, కేంద్రములో భాగమేయనియు నందుచే కేంద్రము ఒక గూడువంటిదనియు అభ్యంతరము తెల్పి వాదింపవచ్చును. కాని వారొకవిషయము గుర్తుంచుకొనవలయును. అర్థమగుటకు మాత్రమే అట్లు స్థూలరూపమున వర్ణించి చెప్పబడినది. అచ్చట నిజముగా గ్రుడ్లవంటివి కేంద్రముచుట్టు కలవనుటలో సందేహము లేదు. పూర్తిగా నొక నిర్దిష్టాజ్ఞ ననుసరించి పనిచేయు నొకానొక శక్తియని పిలువవచ్చును. అది పై విధముగ మాత్రమే వివరింపబడవచ్చును. సూదంటుఱాళ్ళ ధృవ తరంగములను (Field of a magnetic pole) ఉదాహరణముగా తీసికొనిన మీకిది బాగుగా అర్థము కావచ్చును. మాగ్నటిక్ (సూదంటు) రంగముగాని, దాని శక్తినిగాని సూచనలుగాని, పనిచేయు బిందువులుగాని గుర్తింపవలెనన్న ఒక కాగితముగాని, ఒక గాజుపలకగాని ఉంచి దానిపై ఇనుపరజను ఉంచుము. ఆ పలక క్రింద సూదంటురాయి నుంచుము. ఆ పలకను వేలుతో తట్టిన యినుపరజను ఒక ప్రత్యేకపద్ధతిలో కుదురుకొనును. వాటినిక కదిపినను మరల అదేవిధముగా కదురుకొనును. దానినిబట్టి సూదంటురాయి ధృవములశక్తి ఎచ్చట పనిచేయుచున్నది మనము గ్రహింపగలము. కాని ఆ యినుపరజను కుదురుకొనిన ప్రదేశము అసలుశక్తి గల రంగముకాదు. ఆ శక్తి రంగమును గ్రహించుటకై మాత్రమే అవి యుపయోగపడును. అట్లే కేంద్రాధికారములో కేంద్రము చుట్టూగల శక్తి పనిచేయు చుండుటను తెలియజేయుటకై

చేపగ్రుడ్లు ఉదాహరణ మాత్రముగా తెలియజేయబడినవి. ఆ విధముగ, తత్ఫలితముగ సూర్యగోళ పద్ధతియును, ప్రపంచములోని సమస్తమును పూర్తియైనది. కాని దాని యంతటికది ఒక ప్రత్యేక విషయము. ఆ విషయము నిచ్చట నేను చర్చింపబోవుటలేదు. సమయమునుబట్టి మరొకచోట వివరింతును. మిగిలిన వానికంటె నొక కరణము పెద్దదై ప్రకాశవంతమై యున్నది. దానిని గురుకణమని పిలువవచ్చును. అది సరిగా మనము నివసించు ప్రపంచముతో సూటిగా కలసి ఆధిపత్యము వహించియున్నది. అందుచేతనే మనలోకములోనున్న వ్యక్తుల వంటివారు మిగిలిన లోకములలో కనిపించనే కన్పించరు. మనము (మన ప్రపంచము) గురు కణముతో సంబంధించి యుంటిమి. అందుచే నచ్చట నేశక్తికలదో ఆ శక్తినే మనమును కల్గియుంటిమి.

సృష్టిని గురించిన నిజస్థితినిగూడ నేను తెలియజేయవచ్చును. సృష్టి రూపుదాల్చకపూర్వము కేంద్రముచుట్టును అంతర్గత చైతన్యముకలదు. దానిలోను మరియు దాని పరిసరములోనూ అది సంకల్పము (క్షోభ) కల్గినది. దీని నీ కర్థమైనట్లు చైతన్యమనియో, కంపనమనియో, శక్తియనియో మరేమనియో పిలువుము. అది సృష్టికి, దానికవసరమైన ప్రతిదానికి ప్రధాన కారణము. సృష్టిసమయము రాగానే అంతర్గత చైతన్యమందణగియున్న లేక నిద్రించుచున్న భావము పరిపక్వమై, సర్వచైతన్యము మధింపబడి ఒకానొక శక్తి ఉద్భవించి ముందుకు దూసికొనివచ్చెను. ఆ కుదుపులు నేను పైన చెప్పిన కణములుగా (గ్రుడ్లువంటివిగా) రూపొంది శక్తిని సమీకరించుకొన్నవి. మొదటి కుదుపులో గురుకణము ఏర్పడినది. అందుచేనది, అన్నిశక్తుల సమీకరణ విజృంభణముగను, పెద్దదిగను, మిగిలినవాటికంటె ప్రకాశవంతముగను ఉండుట సంభవించినది. మిగిలిన కణములు అచ్చటినుండి ప్రసరించిన సమీకరణ శక్తిచే కల్గినవగుటచే దానియంత శక్తిమంతము ప్రకాశవంతముగా ఉండలేక పోయినవి. ఇది చిచ్చుబుడ్డీ యుదాహరణముతో మీకు స్పష్టముగా తెలియును. ముఖ్య ప్రవాహము సూటిగా మిక్కిలి వేగముగా బయటికి వచ్చును. మిగిలిన అగ్నికణములు, ఆ వేగమును శక్తిని కల్గియుండవు. కాని వాటినన్నిటిని కలిపి చూచినపుడే అగ్నివృక్షమో లేక అగ్నికణముల ప్రవాహమో ఏర్పడును.

కేంద్రాధఃప్రాంతము జీవితమునకు సారములేక ఆధారము నైనట్లే చిన్నచిన్న కణములన్నియు, ఒక పెద్దదానిలో చుట్టబడి, పెద్దకణముతో సంబంధముకల్గి యున్నవి. ఆ పెద్దకణమే గురుకణమని పిలువబడుచు వీని యన్నింటికి సారభూతమై యున్నది. అది ఒక సముద్రపు పెద్ద నీటిబొట్టు, దాని చుట్టూ యీదులాడుచున్నటువంటిది ఆ సముద్రపు నురుగు. మరొక విధముగ చెప్పవలెనన్న దీనితో బంధింపబడిన ప్రపంచముల కిది శక్తినిలయము. గురుకణమున కూడ నట్టి కెరటమేకలదై దానిశక్తి మిగిలిన కణములకు కూడ వర్తించునట్లెరుంగుదురు. ఇది ప్రథమ చలనమున కల్గిన మీగడవంటిదది. గొప్ప వ్యక్తులెప్పుడును ప్రపంచములో నుండుట మనకు విదితమే ! ఈ

ప్రపంచములో పుట్టిన ఋషులు, ఆదిమూలము నుండి కేంద్రప్రాంతములోని కంపనముల రూపములోవచ్చు సూచనల ననుసరించి మిగిలిన ప్రపంచములను గూడ క్రమపఱచు చుందురు.

మీకు నిజము చెప్పవలెనన్న, ప్రపంచములో మార్పు తెచ్చుటకిప్పుడుద్భవించిన వ్యక్తి విశ్వమంతటికి నొక్కడే గలడు. అతని కిష్టమైనచో నే సమయములోనైనను సూర్యునిలోను, చంద్రునిలోను, కారణ శరీరము (Astral form) కన్పట్టగలడు. ఆ వ్యక్తి మనదేగాక యితర ప్రపంచముల పనికూడ చేపట్టును. మీరు మీ దృష్టినభివృద్ధి పరచుకొన్నచో, భౌతికముగ నతడొక్క చోటనే ఉన్నప్పటికి, భగవత్సామ్రాజ్యమందెల్లెడ నతడు వ్యాపించియున్నట్లు గ్రహించగలరు. ప్రజలు దీనిని అలంకారికముగను ఊహా నాటకముగను తీసికొనవచ్చును. కాని వారి యభిప్రాయములతో మేమెంత మాత్రము నేకీభవింపము. అతడు ప్రకృతి ధర్మము పూర్తిగా నభినయించుచున్నాడు.

"భగవంతుడు మానవుని తన ఆకారములోనే సృష్టించె"నని సామాన్యముగా విశ్వసించబడు చున్నది. ఈ విషయములో ప్రపంచములో అన్ని మతములు, తత్వములు, శాస్త్రములు ఏకాభిప్రాయమునే కల్గియున్నవి. అనగా చేతులు, కాళ్ళు మొదలగు అవయవములతోను, చర్మ మాంసాస్థులతోను కల్గిన మానవ శరీరమువంటి భౌతిక శరీరమే దైవమునకు వున్నదనికాదు. దాని సరియైన అర్థము, మనుష్యునిలోగల వివిధములైన శక్తులు ప్రకృతిలో కన్పించు క్రమములో నున్నవనియే. ఒక కవి యిట్లు చెప్పినాడు.

"యహ్ జో సూరత్ హై తేరీ
సూరత్-ఇ-జనాన్ హై యహీ !
యహీ నక్షా హై యహీ రంగ్ హై
హై సమాస్ హై యహీ !

"ఆ ప్రేమమూర్తి ఆకారము వంటిదే నీ ఆకారము. దాని యాకృతి, రంగు, సర్వము నీవంటిదే!"

ఇప్పుడు మానవశరీరములో వీనిస్థితి మీకు చెప్పుదును. నాచే వివరింపబడిన కేంద్రము మనుష్యుని occipital prominance అని పిలువబడు పుఱ్ఱె వెనుకభాగమున, 5వ పటములో చూపబడినట్లు కలదు. అది మూలతత్వముతో మాత్రమే సంబంధము కల్గియున్నది. జీవితసారమది. శరీరమును కాపాడుటకు ముఖ్యావసరమగు శక్తులన్నియు దానికి కలవు. అది వెంట్రుకకంటె సన్నమైన ఒక గుజ్జువంటి పదార్థము. దాని రంగు, పైన చెప్పబడినట్లు, సంధ్యా సమయమందలి బూడిదరంగు గాని, లేక దాని అసమగ్ర ప్రతిబింబముగాని యుండును. కేంద్రముదగ్గర పైన వర్ణించిన కణములు ఈ స్థానము దగ్గరకూడ భౌతిక రూపములో మనకు సరిగా కన్పట్టును.

అవియన్నియు కేంద్రము దగ్గరి గురుకణముతో సంబంధము కల్గియున్నవి. మాటలతో చెప్పుట సాధ్యముకాక అనుభవ పూర్వకముగా మాత్రమే తెలియదగు నీ విషయము మీ కర్థమగునట్లు చెప్పగలిగితినో లేదో నాకు సందేహముగా నున్నది. వివరించుటకు సాధ్యమైనంతవరకు దానిని చెప్పితిని. ఇదియంతయు నా అనుభవము లేక ప్రకృతి పరిశీలనము. నా గురువుగారు నన్ను తయారు చేసి, దయతో నా కీ దివ్యదృష్టి నొసంగినారు. దాని ఫలితమేయిది.

ఇప్పుడు మనము ముఖ్య విషయమును గురించి చెప్పుట పూర్తి చేసితిమి గాన మానవ శరీరములో కేంద్రమున కధోభాగమున గల మరియొక స్థానమును తీసికొందము. అది కేంద్రము యొక్క అపక్వ రూపము. అది ప్రతిక్రియా స్వభావము కలది. దానిని నేను విధ్వంసకాక్షి (Destructive Eye) అని పిలుతును. దానిని తెరచినచో సర్వ ప్రపంచము క్షీణించుటయో, సర్వనాశనము అగుటయో తటస్థించును. మన ముఖ్య విషయమున కది సంబంధించి యుండకపోవుటచే దాని నిచ్చట చెప్పుటలేదు. దానిని చెప్పుటకు నాకనుజ్ఞయు లేదు. ఈ సందర్భములో సంక్షిప్తముగానైన, సర్వమును వివరించితిని. విషయ పరిపూర్ణతకు ఈ విషయమును కూడ కొంత వివరించెదను.

ఈ విధ్వంసకాక్షి కృష్ణునిచే మహాభార యుద్ధ సమయములో నాశనము కావలసినంతమేరకు 18 దినములు తెరచియుంచబడెను అది మరియొకతడవ తెరువబడును. కృష్ణభగవానుడు మార్పు చేయుటకు వచ్చెను. ఆ సమయమందలి ప్రపంచ పరిస్థితుల వలన వాతావరణము విషపూరిత మగుట చూచినాడు. తుదకు మహాభారత పద్ధతిని యోచించినాడు. ఆఖరి సన్నివేశము వచ్చుటకు ముందు 24 సంవత్సరము లనుండి ఆ విషపూర్తి వాతావరణమును తన చిత్‌శక్తిచే భుజించుచూ వచ్చినాడు. మహాభార యుద్ధ సమయము రాగానే యుద్ధవీరులు రణరంగమున నిలబడగానే ఆ ప్రదేశమున విధ్వంసకాక్షిని తెరియుంచినాడు. ఆ నాడున్నంత విపరీతముగా లేకపోయినను ప్రపంచములో నట్టి చిహ్నములు మరల కన్పించుచున్నవి. అంధకారము వ్యాపించుచున్నది. వాతావరణములో విషపూరిత పరిస్థితులేర్పడుచున్నవి. ప్రపంచము మార్పు గోరుచున్నది. ప్రకృతిమాతచే నట్టి పని ఒకానొక వ్యక్తి కీయబడినది.

రాజయోగ భ్రావము చూపితిని. మన భవిష్యత్తును అల్లగల వస్తువది యొక్కటియే ! అది స్వయం సంపూర్ణమైనది. అభ్యాసానుభవములు మాత్రమే దానిని తెలియజేయును. నన్ను గ్రుడ్డిగా నమ్ముమని నేను చెప్పను. కాని దానినిప్పటి నుండి హృదయపూర్వకముగా అభ్యాసము చేసి అనుభవము ద్వారా తెలిసికొనుమని ప్రార్థించుచున్నాను. రాజయోగాభ్యాసమునకు ఇంకను యితర పద్ధతులుకూడ గలవు. కాని ఈ పద్ధతి (ఈ పుస్తకములో చెప్పబడినట్లుగా ఎక్కువ తగినట్టిదని

నమ్ముడు. ఈ శాస్త్రములో నిపుణుని వెదకికొనుమని నా హృదయపూర్వకముగా పాఠకులకు సలహానిచ్చుచున్నాను. అట్టి గురువును కన్గొనుట చాల కష్టము. కాని అట్టివారు ప్రంచములో కలరని చెప్పుటలో సందేహములేదు.

వారిని కన్గొనుట కొక సులభపద్ధతి చెప్పుదును. సన్యాసిగాని, గృహస్థుగాని కానిండు. ఆయన ప్రక్కన కూర్చున్నప్పుడు, ఆత్మస్వభావమైన ప్రశాంతత ప్రాముఖ్యమును వహించి, ఆ సమయములో నీవు నిశ్చింతగ నుందువు. అతనితో నున్నంతకాలము సత్‌తో సంబంధము కల్గి యుందువు. ఫలితము దానియంతటనదే జరుగును. అనగా నతడు తనకై తానేమియు కృషిచేయక పోయినను ఫలితము సంభవించును. కాబట్టి అట్టివ్యక్తిని మీరు నిజముగా వెదకదలచు కొన్నట్లయిన, మీరు చేయవలసినదెల్ల, మీ హృదయము వైపు చూసి మీ మనఃస్థితిని మీరు పరిశీలించుకొనుడు. మిగిలిన చోట్లకంటె మనస్సు ప్రశాంతత వహించును. అంతవరకు మీ మనస్సును వేధించు పెక్కు భావములు అతనితో నున్నంతకాలము మిమ్ము విడిచిపెట్టును. కాని ఒక్క విషయము మాత్రము గుర్తుంచుకొనవలయును. మనస్సునే విధముగను శ్రమ పెట్టరాదు. దాని కట్టి భారమును కలుగరాదు. ఎందువల్లననగా ఈ స్థితి (వేధించు భావములు రాకుండ, మనస్సును నిశ్చలస్థితికి తెచ్చుట) (వశీకరణము) ''మెస్మరిజమ్, హిప్నాటిజమ్'' వంటి క్షుద్ర శాస్త్రములలో ప్రవీణులైన వారిచే గూడ తీసికొని రాబడవచ్చును. కాని రెంటికి బేధమేమన్న రెండవదానిలో భారము, అలసట, మందకొడితనము, మానసికముగా, శారీరకముగా కలుగను. మొదటిదానిలో తేలికదనము ప్రశాంతత అంతట వ్యాపించి మన కానందము కల్గును. దానిని మొదటలోనే మీరు గ్రహింప లేకపోవుట సంభవించినా అట్టి మనుష్యునితో తరచు కలసియున్నచో ఈ సందర్భములో కావలసిన సూచనలు మీకు తప్పక రాగలవు.

ఈ కాలములో ఈ శాస్త్రములో పరిశోధనలు సామాన్యముగా అశ్రద్ధ చేయబడుచున్నవి. తెలిసికొని పరిష్కరించుకొనవలసిన విషయము లనేకములున్నవి. కాని సముద్రములో లోతుకు మున్గినపుడే రత్నము లేరుకొనగలరు.

# ముగింపు

నా యనుభవమునకు, లేక ప్రకృతి పరిశీలనమునకు వీలైనంత వరకు సమగ్రముగ చర్చింతిని. అభ్యాసకులకు విజయము పొందుటకు గల రహస్యమును తెలియజేయుటకై యింకనూ కొన్ని వాక్యములు చెప్పుచున్నాను. ధ్యానమన్నది ఆధ్యాత్మికతకు పునాది వంటిది. నిజమైన గమ్యస్థానము ముందుంచుకొని ధ్యానము చేసిన, మీరు తప్పక గమ్యస్థానము చేరుదురు. గమ్యస్థానము దగ్గరకు చేర్చు అనేక మార్గములు తగినంత గ్రంథములందు వివిధములుగా చర్చింపబడి యున్నవి. సరిగా నడిపింపబడినచో గమ్యస్థానము చేర్చుటకు సహాయపడు బాహ్యశక్తులు కూడ కలవు. ప్రాచ్య తత్వవేత్తలు ఆహారమును గురించి ప్రత్యేక శ్రద్ధ తీసికొనిరి. ఆహారము పరిశుభ్రముగ తగిన విధములో వండబడవలయును. అది ఆరోగ్యమునకు సంబంధించిన విషయము. కాని అది సాత్వికాహారమై నిరంతర భగవధ్యానముతో వండబడిన యెడల దాని శక్తి ఆశ్చర్యకరమై, భగవధ్యానముతో తినినయెడల, అన్నిరకముల ఆధ్యాత్మిక రోగములు నయమై, మన యభివృద్ధికి నభ్యంతరకరములైన విషయములు తొలగింపబడును. ఇదివరలోనే మన గ్రంథములందు దీనిని గురించి సమగ్రముగా వ్రాయబడి యుండుటచే నేనిక్కడ చెప్పనవసరము లేదు. నిజముగ ఆహారమునకు అత్యవసరమైన ఆరోగ్యాధ్యాత్మి కాధారములను పూర్తిగా నశ్రద్ధ చేయుచు చపలచిత్తులై, ఒక ప్రత్యేక తరగతికి చెందని అన్యుడమాయకుడై, పవిత్రుడై, ఆధ్యాత్మికోన్నతి సాధించినవాడైనప్పటికి, ముట్టుకొన్నచో ఆహారము మలినమగునని తలంచకూడదు. హిందువులు సమగ్రముగా ననుభవించుటచే నీపాటికి, నేటి ఆహార పరిస్థితి సాంఘికముగా గాని, ఆధ్యాత్మికముగా గాని లేదని గ్రహించి యుండవలెను. నా భావములను బలపరచుచు ఆధ్యాత్మిక విషయములలో ప్రమాణీకుడా గ్రహింపదగిన వివేకానంద స్వామి చెప్పిన మాటలను ఈ క్రింద నుదహరించుచున్నాను. "అర్థరహితమై, అతిశయమైన పిచ్చి, మతమును పూర్తిగా వంట యిళ్ళకు తరిమినట్లుగ మన కులాచారములనేకములను బట్టి తెలియవచ్చును. ఆధ్యాత్మికతాప్రకాశమున కట్టి మతములో సత్యమెంత మాత్రము నుండదు. దానిని కల్తీ లేని ఒక ప్రత్యేకమగు శుద్ధ భౌతికమని చెప్పవచ్చును. అది జ్ఞానముగాని, కర్మగాని, భక్తిగాని కాదు. అదియొక ప్రత్యేకమైన పిచ్చి. దానికి తమ ఆత్మలను తగిలించినవారు తప్పక పిచ్చి ఆస్పత్రికి వెళ్ళవలసి వచ్చునేమో గాని బ్రహ్మలోకమునకు మాత్రము కాదు." ప్రారంభకునకు కావలసిన మరియొక బాహ్య విషయము మనోవాక్కాయ కర్మలలో నిగ్రహము నభ్యాసము చేయుట. దానివలన ఇతరుల మనస్సునకు ఎట్టి బేధము కలుగరాదు. ఆ విధముగ చేయనిచో అతని హృదయము తానే

పాడుచేసికొన్న వాడగును. అతనికి దాని ప్రతిక్రియ కన్పించకుండగనే ప్రభావము చూపును.

తరువాత నతడు అభ్యాసము చేయవలసిన విషయము ఎల్లప్పుడు ఉత్తమత్వమునే ఆలోచించుచు నుండుట. గమ్యస్థానము చేరలేమనుభావమునకు ఏవిధముగను లొంగకూడదు. ఈ సందర్భములలో దృఢ సంకల్పము చాలనవసరము. నిరుత్సాహ భావమునకు త్రోవదీయు నాలోచన ఈ మార్గమునకు పెద్ద ఆటంకము. ఆధ్యాత్మిక రంగములో నిరుత్సాహమునకు కారణము, సామాన్యముగ విజయము సాధించుట చాల కష్టము క్లిష్టమునని ప్రజలు తలంచుటయే యనిపించుచున్నది. మనము పొందవలసిన విషయము చాల సులభమై మన అందుబాటులో నున్నది. ఆ సులభవిషయమును పొందుటకు మన ముపయోగించెడు కఠిన పద్ధతులే దానిని నిజముగా కష్టము క్లిష్టము చేసినవి. ఈ క్రింది యుదాహరణము ఈ సమస్యను స్పష్టపరచును. ఒక సూది నేల మీద పడియున్నదనుకొనుడు. దానిని పైకి నెత్తవలె ననుకొనుడు. మీ వ్రేళ్ళ సహాయమున దానిని తీయుట చాల సులభము. అయినప్పటికిని ఒక క్రేన్ (బరువు వస్తువులను ఎత్తు యంత్రము కుపయోగించు మహా యంత్రము) గాని అంతకంటె పెద్ద యంత్రమును గాని ఆ సూదిని తీయుట కుపయోగించినచో నది చాల కష్టమై మీ ప్రయత్నములో మీరు విఫలులగుటయు సంభవించును. సరిగా నట్లే చాల సులభమైన భగవంతుని పొందుటలో మీరు క్లిష్టాతిక్లిష్టములైన పద్ధతుల ననుసరింపదలచినచో, విఫలులగుట సంభవించును. ఆధ్యాత్మిక రంగములో ప్రజలు సూదిని మహాయంత్రముతో నెత్తుటకు ప్రయత్నించుచున్నారు. అది కేవలము అపోహ. దానిని తుడిచివేసికొన్నచో నిరుత్సాహము పూర్తిగా తొలగిపోవును.

మేము నొక్కి చెప్పుచున్న పద్ధతి సమర్థుడైన గురు సహాయమున హృదయముపై ధ్యానించుటతో ప్రారంభమగును. ఆ గురువు పరిపూర్ణత పొంది "ప్రాణాహుతి" శక్తి కల్గినవాడై యుండును. అట్టి గురువు మన ఆధ్యాత్మికాభివృద్ధికి ఆటంకములను తొలగించును. అతని నుండి వచ్చు ఆధ్యాత్మికపు కెరటములు మన హృదయములోని కెడతెగక ప్రవహించి రోజురోజునకు మనలో ప్రశాంతతను పెంచును. మనము ధ్యానములో నిమగ్నులమై యున్నచో కోరిన ఆంతరంగిక విషయముతో సంబంధము కల్గియుందుము. ఇందలి భక్తి మన శక్తిని పెంచి మార్గమును మృదువు పరచును. మన హృదయమును గురుశక్తికి లక్ష్యముగా నేర్పరచుకొన్నచో, అంతర్గతముగా వైశాల్యము హెచ్చి, కాలము గడచిన కొలది భగవత్సామ్రాజ్య మందంతట మనము వ్యాపించుచున్నట్లు తోచును. నేనీ విషయము కేంద్ర ప్రాంత మధ్యమందు తమ్ముతాము నిల్పుకొన్న వారిని గురించి చెప్పుచున్నాను. అట్టివాడు తన చిత్శ్శక్తితో చేయు పనిని మిగిలన వారు బాహు బలముతోడ చేయలేరు. భౌతిక దృష్టికది నచ్చకపోవచ్చు. ఎందువల్లననగా ప్రపంచము దానికై వాదించు వారిముందు చిన్నదిగా నుండును. ప్రజలు ఈ దృష్టి నభివృద్ధి పరచుకొన కుండుటచే

దీనిని "కుక్క మొరుగు" వంటి విషయముగా భావింప వచ్చును. ఇతఃపూర్వము వర్ణింపబడిన వ్యక్తివంటివాడు ఎవరికిని మిత్రుడు గాని శత్రువుగాని కాడు. అతడు సమదృష్టి కల్గియుండును. దానినెప్పుడును వీడడు. అతడొకవేళ నట్టి అసమానతను ఒక్క క్షణమైన చూపించినచో, వాతావరణము వ్యతిరేకించి దుఃఖభూయిష్ట ఫలితములు కల్గును. అట్లు కొంతకాలము సాగినచో ఛాయామాత్ర ప్రజాహృదయములు నశించును. ఆ స్థితిలో సంస్కారములన్నియు పోయి, లోక వ్యవహారములు వానియంతటవే జరుగును. కాని సంస్కారములట్లే మిగిలియున్నచో జీవిత సమస్యా పరిష్కారము జరగనే జరుగదు.

మన ఆధ్యాత్మ యాత్రలో (March to freedom) వివిధాకృతులు వర్ణములు గల వివిధ చక్రములు దాటవలయును. అవన్నియు హృదయ ప్రాంతములో గలవు. దానిపై స్థితి యితఃపూర్వానుభవము కంటె భిన్నముగా నుండును. "చక్రములు" గడచినవి, పురోగమించిన వెంటనే "ఆవరణలు" నశించును. కాని సమర్థుడైన గురు సహాయమున తరువాతి మార్గము సుగమమగును. దృఢ నిశ్చయము, గమ్యస్థానము చేర నిరంతర నిర్విరామత విజయమును సాధించును.

శ్రీకృష్ణభగవానుడు యోగులకు తెలియునట్లుగా రాజయోగములో భక్తిని ప్రవేశపెట్టినాడు. ఎందువల్లనన, జీవితమునకు స్థిరత్వము లేని సమయము దగ్గరపడినదని అతడు గ్రహించెను. సిద్ధాంతములకు అభ్యాసములకు చాల భేదము కలదు. రాత్రింబవళ్ళు ఒకే విషయమును చెప్పుచున్నచో మీకు క్షణికమైన మానసికాభిరుచి కలుగవచ్చునే తప్ప, దానివల్ల నెట్టి ప్రయోజనము లేదు. ఆధ్యాత్మిక రంగములోనికి భక్తి శ్రద్ధ విశ్వాసములతో రెండు, మూఢాభి ప్రాయములను పారద్రోలి అభ్యాసమునకు సిద్ధముకండు. పురాణములు పదేపదే చదివిన ఆధ్యాత్మికతాధికారము కల్గునన్న అపోహలో పడవద్దని కోరుదును. ఆ విధముగ చేసి తత్వవేత్త కావచ్చును. పండితుడు కావచ్చును. కాని ప్రేమ భక్తులతో కూడిన సరియైన అభ్యాసము లేనిచో యోగి మాత్రము కాలేడు. గోధుమను అనేక పర్యాయములు తిన్నను, దాని రుచి యిట్టిదని మాటలతో చెప్పలేనట్లు అనుభవ విషయములను మాటలతో చెప్పుట చాల కష్టము.

పైన చెప్పినదాని నిజస్థితిని తెలిసికొనుటకు ప్రజలు సంసిద్ధులగు శుభోదయము వచ్చు గాక!